# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గురువారం 20 ఏప్రిల్ 2023



వార్త IVవ పేజీలో
శ్రీ చైతన్య టక్నో స్కూల్ ఉత్తమ విద్యార్థినిని అభినందిస్తున్న కడప మేయర్ సురేష్ బాబు

## విజిలెన్స్ దాడులు

**పుల్లంపేట, ఏప్రిల్ 19 ప్రభాతవార్త**

పుల్లంపేట మండలంలో వత్తలూరు పంచాయతి దేవసముద్రం చెరువు వద్ద కడపకు చెందిన విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవసముద్రం చెరువు నుంచి మట్టి తోలుతున్న టిప్పర్లను, పొక్లైన్‌లను మట్టి తోలకుండా నిలుపుదల చేశారు. ఉదయం 11 గంటల సమయంలో పట్టుకొన్న ఈ అధికారులు సాయంత్రం 4 గంటల వరకు తనిఖీ కార్యక్రమాలను నిర్వహించారు. దాంతో చెరువులోనే టిప్పర్లు, యంత్రాలు నిలిచిపోయాయి.

ఈ విషయమై 'ప్రభాతవార్త' విజిలెన్స్ అధికారులను వివరణ కోరగా అందులో ఒకరు పోలీసుశాఖకు చెందిన సిఐ బాషా అని, మరొక అధికారి జియాలజిస్టు శాఖకు చెందినశ్రీనివాస్ అని తెలియజేశారు. ఎపిజి04టివి 208 నంబరు గల టాటా వాహనంలో వీరు వచ్చి ఈ దాడులను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు రికార్డులను తనిఖీ చేస్తున్నామని అనంతరం చర్యలు తీసుకొంటామని తెలియజేశారు.

# కార్యకర్తలకు అండగా ఉంటా

- హత్యా రాజకీయాలకు పాల్పడుతున్న వైసీపీ
- అభివృద్ధిపై నిర్లక్ష్యం చూపుతున్న జగన్ రెడ్డి
- రోడ్డున పడ్డ నిరుద్యోగులు
- లిక్కర్, ఇసుక దందాలతో జేబులు నింపుకుంటున్న నాయకులు
- బద్వేలు ప్రాంత అభివృద్ధికి వీరారెడ్డి ఎనలేని కృషి
- రాబోయేది టీడీపీ పాలనే
- కష్టపడి పనిచేసి అభ్యర్థుల గెలుపుకు కృషి చేయండి
- కార్యకర్తల సమావేశంలో తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు











**బద్వేలు, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**

కార్యకర్తలు కష్టపడి పనిచేసి రాబోయే తెలుగుదేశం గెలుపులో భాగస్వాములు కావాలని, రౌడీయిజం పరిపాలన పోయి సుపరిపాలన రావాలని కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. బద్వేలులోని చెన్నంపల్లె వద్ద ఉన్న ఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువ నేత రితీష్ రెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం హత్యా రాజకీయాలకు పాల్పడుతుందని, ప్రశ్నిస్తే గొంతు నొక్కే ప్రయత్నం జరగడమేగాక ఎదిరించిన వారిని అంతమొందించేంత వరకూ నిద్రపోవడం లేదన్నారు. ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెట్టి జైలులో పెట్టడం ఆనవాయితీగా మారిందని, హత్యా రాజకీయాలు నడిపిస్తున్న వైసీపీ ప్రభుత్వం జగన్ రెడ్డికి కాలం చెల్లిందన్నారు. వివేకానంద రెడ్డి హత్య వెనక ఆనాడు మా హస్తం ఉందని దుష్ప్రచారం చేయడమేగాక హత్యా రాజకీయాలు చేస్తూ బాబాయ్‌నే పొట్టన పెట్టుకున్న గొప్ప నాయకుడు జగన్ రెడ్డి అని, ఈ రోజు వివేకా కుమార్తె సునీత గట్టిగా నిలబడబట్టి నిజా నిజాలు బయటపడ్డాయన్నారు. ఒక పక్క బటన్ నొక్కి పేదలకు డబ్బులు పంపిణీ చేసి, అదే డబ్బును రెండింతలుగా దోచుకున్న నాయకుడు ఎవరైనా ఉన్నారంటే ఒక్క జగన్ రెడ్డి అని గర్వంగా చెప్పవచ్చున్నారు. నిత్యావసర ధరలు పెరిగిపోయి ప్రజలు భారం భరించలేకపోతే వాటిని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అభివృద్ధి చెయ్యరు, నిరుద్యోగ సమస్యతో యువత సమతమతం అవుతుంటే పట్టించుకోరు, పన్నుల పేరుతో దోచుకోవడం తప్ప వీరికి పరిపాలన తెలియదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో సర్పంచ్‌లకు అధికారంతో పాటు నిధులు ఇచ్చి 25 వేల కిలోమీటర్ల రోడ్డు వేసిన ఘనత టీడీపీదే అన్నారు. ఈ ప్రభుత్వంలో సర్పంచ్‌లకు విలువే లేకుండా చేశారని, ఈ మధ్య ఆ పార్టీకి చెందిన సర్పంచే ఏమి చేశారో మనం చూశామన్నారు. మరుగుదొడ్లు కట్టించాం, ప్రతి ఇంటికి గ్యాస్ ఇచ్చాం, 2 రూపాయలకే కిలో బియ్యం ఎన్టీఆర్ దయ వలన దేశ వ్యాప్తంగా ప్రజలకు పంపిణీ చేయడం సంచలనం రేపిందన్నారు. ఒక్క ప్రాజెక్టు కూడా నిర్మించలేదు, కడప జిల్లాలో ఆనాడు ఎన్.టి.రామారావు కృషితోనే ప్రాజెక్టు ఏర్పాటు చేయడమేగాక చెరువులకు నీరందించి ప్రతి ఎకరం సాగులోకి వచ్చేలా చేశారన్నారు. రాజకీయాలకు అతీతంగా పార్టీ పని చేసిందన్నారు. సోమశిల నుండి 5 టిఎంసీల నీరు ఈ ప్రాంతానికి ఇచ్చేందుకు జీవో తెచ్చాం, కానీ వైసీపీ ఏమీ చేయలేదని ఆరోపించారు. వంశదార నుండి పెన్నా నది వరకు అనుసంధానం చేస్తే కరువు అనేది ఉండదని, ఇది టీడీపీ హయాంలో చేస్తామని కార్యకర్తలకు మాట ఇస్తున్నానన్నారు. బిజివేముల వీరారెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేయడమేగాక కార్యకర్తలకు అండగా నిలిచి బద్వేలు వీరారెడ్డిగా పేరుపొందారన్నారు. 6 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది, మంత్రిగా సేవలందించి ప్రజల మన్ననలు పొందారని, విజయమ్మ, రితీష్ రెడ్డి సేవలు కూడా పార్టీకి ఎంతో ఉపయోగపడుతున్నాయని, ఈ ప్రాంతంలో మళ్ళీ పూర్వ వైభవం రావాలంటే మన అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో ఎస్సీ భూములు అన్యాక్రాంతమయ్యాయని, దోచుకోవడానికి వైసీపీ నాయకులు మొదలుపెట్టారని, కబ్జాల పర్వం రోజు రోజుకూ పెరిగిపోతుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యువ నేత రితీష్ రెడ్డి కోరిన విధంగా ఈ ప్రాంత భూములపై కమీషన్ వేసి కబ్జాకు గురైన భూములు, దళితుల నుండి లాక్కున్న భూములన్నీ వెనక్కి తీసుకుంటామన్నారు. పార్టీ కోసం విజయమ్మ, రితీష్ రెడ్డి కృషి చేస్తున్నారని, వారికి కార్యకర్తలు అండగా నిలిచి మన అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని, త్వరలో అభ్యర్థిని కూడా ప్రకటిస్తామని కార్యకర్తలకు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వంలో రెడ్లకు కూడా ప్రత్యేక స్థానం కల్పించడం జరిగిందని, ఇది గమనించాలని, అందరికీ పార్టీ అండగా ఉంటుందని, కుల, మతాలకు అతీతంగా పని చేస్తామన్నారు. ప్రొద్దుటూరులో సుబ్బయ్య అనే వ్యక్తి ప్రశ్నించినందుకు చంపడమేగాక వారి కుటుంబాన్ని రోడ్డున పడవేశారని, అయినా టీడీపీ వారి కుటుంబానికి అండగా నిలిచి ఆదుకుందన్నారు. కాకినాడలో ప్రజా ప్రతినిధి నేరుగా హత్య చేసి మృతదేహాన్ని కారులో పెట్టారని, ఇలాంటి హత్యా రాజకీయాలు వైసీపీలోనే జరుగుతాయని, ఈ పాలన పోయి ప్రజలకు సుపరిపాలన అందించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నామని, ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పులివెందుల పులి బిడ్డ రాంభూపాల్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించడం జరిగిందని, అదే ఉత్సాహంతో పనిచేసి రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు అమరనాథ్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువ నేత రితీష్ రెడ్డి, కైవల్యా రెడ్డి, లింగారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, వెంగల్ రెడ్డి, పార్థసారధి, ఝాన్సీ, కొంకుల రాంబాబు, రంతు, వేణుగోపాల్ రెడ్డి, రవి కుమార్ రెడ్డి, రాజశేఖర్, సుధాకర్ రెడ్డి, సమ్మెట అబ్రహాం, కనమర్లపూటి ప్రసాద్ తదితర టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

## రైలు కింద పడి దంపతులు ఆత్మహత్య

### - అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం - కనుమలోపల్లెలో ఘటన

**కడప క్రైం, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**

వివాహ ఏడాదికే ఓ జంట రైలు కింద ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కడప జిల్లాలోని భాకరాపేట సమీపంలోని కనుమలోపల్లె వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనలో మృతురాలు 8 నెలల గర్భవతి కూడా విషాదకరమైన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. చెన్నూరు మండలం రామనపల్లెకు చెందిన సాయికుమార్‌రెడ్డి(29), హేమామాలిని (28) లకు ఏడాది క్రితం వివాహమైంది. వీరిరువురు కడప నగరం విజయదుర్గా కాలనీలో ఓ ఇంట్లో అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. సాయికుమార్ ఈకాం వాటర్ డిస్ట్రిబ్యూటర్‌గా పని చేస్తూ జీవించేవాడు. హేమామాళిని మరియాపురంలోని ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేస్తోంది. అయితే కొంత కాలంగా భార్యభర్తలు ఆర్థిక సమస్యలతో సతమవుతున్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది భార్యభర్తలు ఇరువురు మంగళవారం రాత్రి కడప శివార్లలోని కనుమలోపల్లె సమీపంలో రైలు కింద ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం ఉదయం రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో రైల్వే ఎస్సై రారాజు ఘటనా స్థలానికి చేరుకొని చెల్లా చెదురుగా పడిన మృతదేహాలను పరిశీలించి శవ పరీక్ష నిమిత్తం రిమ్స్‌కు తరలించి వారి బంధువులకు సమాచారం అందించారు. వివాహమై ఏడాది గడవకముందే నవదంపతులు ఆత్మహత్య చేసుకోవడంతో వారి బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.





కాగా దంపతులు ఆర్థిక సమస్యలతోనా లేక వేరే కారణాలున్నాయా అని రైల్వే పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రారాజు తెలిపారు.

## అవినాష్ నుంచి నాకు ప్రాణ హాని ఉంది

### - భద్రత పెంచాలని ఎస్పీని కలిసిన అప్రూవర్ దస్తగిరి



**కడప క్రైం, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**

మాజీ మంత్రి వైఎస్.వివేకా హత్య కేసులో నిందితుడిగా ఉండి, అప్రూవర్‌గా మారిన దస్తగిరి తనకు సీఎం జగన్, ఆయన సోదరుడు ఎంపీ అవినాష్ నుంచి ప్రాణ హాని ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అన్బురాజన్‌ను కలిసి తనకు సెక్యూరిటీ పెంచాలని ఫిర్యాదు చేశాడు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎంపీ అవినాష్‌రెడ్డి పదే పదే తనను డబ్బులకు అమ్ముడుపోయాడని ఆరోపించడం సరికాదన్నారు. డబ్బు తీసుకున్నట్లు వారు నిరూపిస్తే జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని నిరూపించలేని పక్షంలో తన పదవికి రాజీనామా చేసి జైలుకు వెళ్తారా అని ప్రశ్నించారు. వివేకా హత్య అవినాష్‌రెడ్డి డైరెక్షన్‌లో జరిగిందని సూత్ర, పాత్రదారుడు అవినాష్ అని తన వరకు వచ్చే సరికి ఆరోపణలు చేస్తున్నారని విచారణ ఏం జరుగుతోందో అర్థం కాని పరిస్థిఇ ఉందంటున్నారన్నారు. తన ప్రాణానికి ముప్పు వాటిల్లితే సీఎం జగన్, అవినాష్‌రెడ్డి బాధ్యత వహించాలని ఈ సందర్భంగా తెలిపారు. తనకు బందోబస్తు పెంచాలని సీబీఐ, కడప ఎస్పీ రిజిస్టర్ పోస్టు ద్వారా వినతిపత్రం పంపిస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## బద్వేలు అభ్యర్థి గెలుపుకు కృషి చేయండి

### - కార్యకర్తలకు నారా చంద్రబాబు నాయుడు పిలుపు


బద్వేలు కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.

**బద్వేలు, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**

రాబోయే ఎన్నికల్లో బద్వేలు అభ్యర్థి గెలుపు కోసం కష్టపడి కార్యకర్తలు పనిచేసి భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మీపైన ఉందని తెలుగుదేశం పార్టీ అద్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మాజీ ఎమ్మెల్యే విజయమ్మ నివాసంలో యువ నేత రితీష్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధి కోసం బిజివేముల వీరారెడ్డి ఎనలేని కృషి చేశారని, తరువాత వారి కుమార్తె, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువ నేత రితీష్ రెడ్డిలు కార్యకర్తలకు అండగా ఉంటూ గెలుపు కోసం కృషి చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో అభ్యర్థిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం గెలుపు బద్వేలు నుండే మొదలు కావాలని, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని, నా వద్దకు ఏ నాయకుడు, కార్యకర్త రావాల్సిన అవసరం లేదని, మీ గెలుపే నన్ను రప్పిస్తుందన్నారు. సమిష్టిగా కృషి చేసి ఈ ప్రాంతంలో తెలుగుదేశం జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. యువ నేత రితీష్ రెడ్డి ఉత్సాహంగా పని చేస్తున్నారని, వారికి కార్యకర్తలు అండగా ఉండాలన్నారు. అనంతరం 24వ తేదీన చంద్రబాబు నాయుడు జన్మదిన సందర్భంగా ముందుగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువ నేత రితీష్ రెడ్డి, కైవల్యా రెడ్డి, రాజశేఖర్, వెంగల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ సోమేసుల పార్థసారధి, కనమర్లపూటి ప్రసాద్, మంచూరి సూర్యనారాయణ రెడ్డి, కొంకుల రాంబాబు, వేణుగోపాల్ రెడ్డి, మన్యం మహేశ్వర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రంతు గోపాల్, రవి కుమార్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మిత్తికాయల రమణ, విష్ణువర్ధన్ రెడ్డి, సమ్మెట అబ్రహాం మరియు నియోజకవర్గంలోని ఏడు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ శాఖల ద్వారా సంతృప్తి స్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

### జిల్లాలలో పర్యటించనున్న ప్రత్యేక అధికారులు

### ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య





**రాయచోటి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**

ప్రభుత్వ శాఖల ద్వారా సంతృప్త స్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి నారాయణ భరత్ గుప్త తో కలిసి జిల్లా కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు రాయచోటి కలెక్టరేట్ నందలి మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీష పి.ఎస్, డిఆర్ఓ సత్యనారాయణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ నవరత్నాల పథకాలు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలలో ఆయా శాఖల ద్వారా ప్రజలకు నాణ్యమైన, మెరుగైన సేవలను సంతృప్తస్థాయిలో అందించాలన్నారు. స్పందన కార్యక్రమం ద్వారా అందుతున్న అర్జీలను నాణ్యవంతంగా పరిష్కరించడం ద్వారా... ఎక్కువ శాతం ప్రజల సమస్యలు తొలగి అధికారులపై ఒక మంచి నమ్మకం ఏర్పడుతుందన్నారు. స్పందనకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో ఒక అనాలసిస్ చేశామని, ఇందులో రెవెన్యూ, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి, హోమ్, వైద్య ఆరోగ్యం మరియు కుటుంబ సంక్షేమం తదితర 5 శాఖలకు సంబంధించి అర్జీలు తరచు ఎక్కువగా వస్తున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. రెవిన్యూ, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్, సంక్షేమ వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలలు, గృహ నిర్మాణం తదితరాలలో తరచూ క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజల సమస్యలను నాణ్యవంతంగా మెరుగ్గా పరిష్కరిస్తున్నారా లేదా, ఇంకనూ తీసుకోవాల్సిన చర్యలు తదితరాలపై పరిశీలించడానికి ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక అధికారి నియమించిందన్నారు. వీరు త్వరలో అన్ని జిల్లాలలో పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డిఓ రంగస్వామి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రుల్లో ఆధునిక పరీక్షలు

### ప్రైవేటుకు దీటుగా.. పేదవాడికి అండగా..

### మాస్టర్ హెల్త్ చెకప్.. 60 పరీక్షలు ఉచితం

**రాయచోటి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వస్తువుల కల్పనకు శ్రీకారం చుట్టింది జబ్బు చేసిన వ్యక్తికి ఎటువంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకోవడానికి కచ్చితంగా పరీక్షలు అవసరం పరీక్షలు చేయకపోతే వారికి వైద్యం అందించిన కష్టం దీంతో పరీక్ష కేంద్రాలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ల్యాబ్ లో ప్రతి పరీక్షకు వేలకు వేలు వసూలు చేస్తున్నారు చక్కెర వ్యాధి మొదలుకొని రక్త పరీక్ష గల కాలేయం కిడ్నీ మూత్ర సంబంధ పరీక్షలు ఇతర ఆధునిక పరీక్షలకు ఖచ్చితంగా పట్టణ ప్రాంతాలకు పోవాల్సిన పరిస్థితి ఉండేది రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఉద్దేశంతో సుమారు 60 పరీక్షలు స్థానిక పిహెచ్సిలో నిర్వహించే విధంగా అత్యాధునిక పరికరాలను సమకూర్చింది జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్సీలకు వీటిని పంపిణీ చేశారు స్థానికంగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్లు ఈ పరిచర్య చేయడానికి అవకాశం కల్పించారు గతంలో మండల స్థాయి పీహెచ్ఈఎల్ లో సైతం ఇటువంటి పరీక్షలు నిర్వహించలేక పట్టణ కేంద్రాలకు రోగులను పంపించేవారు కాస్త డబ్బు పెట్టుకునే వారైతే ప్రైవేట్ ల్యాబ్ లకు వెళ్లేవారు స్థానికంగా వైద్య సేవలు మెరుగుపరచడం కోసం ప్రతి పీహెచ్సీకి లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి ఆధునిక పరికరాలను పంపించారు మొత్తం 60 రకాల పరీక్షలు చేయాలంటే ప్రైవేట్ ఆస్పత్రిలో కనీసం ఐదు నుంచి 6000 ఖర్చు అవుతుంది అటువంటిది నయా పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వ ధర్మాస్పత్రుల్లో పరీక్షలు నిర్వహించడానికి వసతులు కల్పించారు చక్కెర వ్యాధి నిర్ధారణ కోసం డైరెక్ట్ బేలూ రూబిన్ శిరం బెలూన్ రూబిన్ ఫాస్టింగ్ షుగర్ పరీక్షలకు 500 రూపాయలకు పైగా ఖర్చు అవుతుంది సీరం క్రియాటిన్ సీరం అనాలిసిస్ బ్లడ్ యూరియా యూరిక్ యాసిడ్ ఎస్ జి ఓ టి ఎస్ జి పి టి సీరం ఆల్కలైన్ టోటల్ ప్రోటీన్ ఆల్బమ్ థైరాయిడ్ పరీక్షలు ఇలా అనేక రకమైన పరీక్షలు నిర్వహించడానికి స్థానిక పీహెచ్సీలకు అవసరమైన యంత్ర పరికరాలను ప్రభుత్వం సమకూర్చింది అయితే కొన్ని పీహెచ్సీల్లో పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించడం లేదు దీనికి ప్రధాన కారణం అక్కడ ఉన్న సిబ్బందికి సరైనటువంటి శిక్షణ లేకపోవడం అవగాహన కల్పించకపోవడం వల్ల విలువైన యంత్ర పరికరాలు మూలన పడిపోయాయి మరోవైపు పరీక్షలకు అవసరమైన కిట్లు ఇతర కెమికల్స్ పూర్తిస్థాయిలో సర్ఫంచ్ చేయకపోవడం వల్ల కొన్ని పరీక్షలను బయటకు రాస్తున్నారు గర్భవతులు చిన్న పిల్లలకు సంబంధించి అన్ని పరీక్షలను స్థానికంగా ఉన్న పీహెచ్సీల్లో నిర్వహించడానికి సౌకర్యాలు మెరుగుపరిచారు అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో ఇటీవల ప్రారంభించిన హెల్త్ సెంటర్ల నందు ఆధునిక ల్యాబ్ పరికరాలు అందజేయడంతో ప్రజలకు చాలా మేలు జరుగుతున్నది ముఖ్యంగా మదనపల్లి రోడ్డు సమీపంలో ఇటీవల ప్రారంభించిన హెల్త్ సెంటర్ నందు అర్హత కలిగిన ల్యాబ్ టెక్నీషియన్ రమణ ప్రజలకు రోగులకు అన్ని రకాల పరీక్షలను నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు ఈ హెల్త్ సెంటర్ కు ప్రతినిత్యం భారీ సంఖ్యలో రోగులు ప్రజలు రకరకాల పరీక్షలు చెకప్ లు చేయించుకుంటున్నారు ఇలా మెరుగైన ల్యాబ్ టెక్నీషియన్ వల్ల జబ్బులు ఏమైనా ఉంటే డాక్టర్ సంప్రదించి వైద్యం పొందడం సులభం అవుతున్నది స్థానిక పీహెచ్సీలకు అవసరమైన మందులు సరఫరాలో కొంత ఇబ్బంది తలెత్తుతుంది కొన్ని మందులు పూర్తిస్థాయిలో సరఫరా అవుతున్నప్పటికీ మరికొన్ని మందులు అందుబాటులో ఉండడం లేదు డిమాండ్ కు తగ్గట్టుగా మందులు సరఫరా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



## మనిషి సత్ప్రవర్తనలో నడిచేందుకు రంజాన్ ఉపవాసాలు ఉపకరిస్తాయి

### ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ భాషా, కలెక్టర్ విజయరామరాజు

**కడప, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**

పవిత్ర రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందులు.. ప్రజల మధ్య ఆత్మీయ సహృద్భావాలను పరిమళింపజేస్తాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, యస్.బి అంజాద్ బాషా పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో.. కడప నగరం మద్రాస్ రోడ్డులోని నుర్జాహాన్ ఉర్దూ ఘర్-కం-షాదీ ఖానా ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన దావాత్-ఏ- ఇఫ్తార్. "ఇఫ్తార్ విందు" కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.బి. అంజాద్ బాషా, జిల్లా కలెక్టర్ విజయ్ రామరాజు, కడప నగర మేయర్ సురేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, శిక్షణ కలెక్టర్ రాహుల్ మీనా, కడప,పులివెందుల, జమ్మలమడుగు ఆర్డీవోలు ధర్మచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి జనాబ్ ఆరిఫ్ ఉల్లా హుసేని పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా మాట్లాడుతూ ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ కులమతాలకు అతీతంగా కడప నగరం మత సామరస్యానికి ప్రతీక అని అన్నారు. జిల్లా కలెక్టర్ విజయ్ రామరాజు మాట్లాడుతూ పవిత్ర దైవారాధనకు, ధార్మిక చింతనకు, దైవభక్తికి క్రమశిక్షణకు, దాతృత్వానికి రంజాన్ మాసం ఆలవాలం అన్నారు. మనిషి సత్ప్రవర్తనలో నడవడానికి రంజాన్ ఉపవాసాలు ఉపకరిస్తాయన్నారు. సర్వమతాల సారం ఒక్కటేనని, ఉపవాస దీక్షలు ఆరాధన ప్రార్థనలు మనుషుల్లో ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ ఉపవాసాల ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ దైవం అనుసరించిన మార్గంలో నడవాలన్నారు. ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, వైకాపా నాయకులు ఉమయిర్, వైకాపా నాయకులు అఫ్జల్ ఖాన్, డాక్టర్ సొహైల్, అహమ్మద్, సుబాన్ బాషా, నరపురెడ్డి సుబ్బారెడ్డి, తోట కృష్ణ, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణ కిషోర్, హజ్ కమిటీ ఛైర్మన్ గౌస్ లాజం, సోషల్ వెల్ఫేర్ ఛైర్మన్ పులి సునీల్, బీసీ వెల్ఫేర్ అధికారి బ్రహ్మయ్య, జిల్లా అధికారులు, స్థానిక కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు, మైనారిటీ నాయకులు, మత గురువులు తదితరులు పాల్గొన్నారు.



## మసీదు అభివృద్ధికి రూ.10వేలు వితరణ

రామసముద్రం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :



రామసముద్రం మండలంలోని తిరుమలరెడ్డిపల్లెలో ఉన్న మసీదు అభివృద్ధి కోసం పదివేల రుపాయలు విరాళం అందజేశారు. జనసేన పార్టీ రాయలసీమ కోకన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి రూ.10వేలు ముస్లిం మతపెద్దలకు విరాళం గా అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ మసీదుల అభివృద్ధి కోసం ఇటీవల రూ.25లక్షలు విరాళంగా ఇవ్వడం జరిగిందన్నారు. ఆయన స్ఫూర్తితోనే తిరుమలరెడ్డిపల్లె మసీదు అభివృద్ధి కోసం తనవంతు సహాయ సహకారాలు అందించానన్నారు. కార్యక్రమంలో మత గురువులు ముతవల్లి అన్సర్‌బాషా, ఇమాం నౌసాద్, జంగాల శివరామ్, సనాఉల్లా, మండల అధ్యక్షులు చంద్రశేఖర్, గ్రానైట్‌బాబు, లక్ష్మీపతి, కుమార్, జనార్ధన్, క్రాంతి కుమార్, విశ్వనాథ్, జబీవుల్లా, ముక్తియార్, శుబాన్ పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్. కె. నాగరాజు

ఖాజీపేట ఏప్రిల్ 19, ప్రభాతవార్త



రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం అక్టోబర్ 15 వ తేదీ నుండి అమలులో ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. నాగరాజు పేర్కొన్నారు. బుధవారం ఖాజీపేట మండలంలోని చెర్లోపల్లి, కొత్తపేట సుంకేసుల గ్రామాలలో జరుగుతున్న "కుటుంబ డాక్టర్ విధానం ", సాధారణ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం", డాక్టర్ వైఎస్ ఆర్ కంటివెలుగు కార్యక్రమాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి డాక్టర్లు, సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు, అంగన్వాడీ కార్యకర్తలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఖాజీపేట వైద్యాధి కారి డాక్టర్ అయేషా సుల్తానా, మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం, సి హెచ్ఓ వెంకటసుబ్బమ్మ, కీర్తి,శిరీష, ఏ యన్ యం లు పక్కృతమ్మ, శివనాగమణి, ఇంద్రామణి, ఆదిలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్స్ భాస్కర్ మోహన్ కృష్ణయ్య,ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లెక్రైం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :

వేర్వేర కారణాలతో ఇద్దరు ఆత్మహత్యకు యత్నించారు. అంకిశెట్టిపల్లెకు చెందిన ప్రశాంత్ భార్య మేరీ(35) బుధవారం కుటుంబసమస్యలపై భర్తతో గొడవ పడి మనస్థాపం చెంది పురుగుల మందుతాగి ఆత్మహత్యకుయత్నించింది. బి.కొత్త కోట మండలం సామదపల్లెకు చెందిన రవీంద్ర బార్య మంజుల (35) వ్యవసాయ పనులు చేస్తుండేది ఈ క్రమంలో అనారోగ్యంతో మనస్థాపం చెందిన గుళికమందు తిని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను జిల్లా ఆసుపత్రిలో చేర్పించి చికిత్సలు చేయిస్తున్నారు.

## చైతన్య టెక్నోస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ దినోత్సవం

మదనపల్లెక్రైం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :



పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లోని శ్రీ చైతన్య టెక్నోస్కూల్‌లో యుకేజి విద్యార్థి ని విద్యార్థులను ప్రైమరీ తరగతులకు ప్రమోట్ చేస్తూ బుధవారం గ్రాడ్యుయేషన్ దినోత్సవం ప్రిన్సిపాల్ శ్రీదర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఏజిఎం ఎ.శ్రీనివాసులు పాల్గొని పిల్లలకు ప్రసంశాపత్రాలు, మెడల్స్‌ను బహూకరించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో చైతన్య స్కూల్స్ ప్రిన్సిపాల్ పి.శ్రీధర్, ఆర్.విజయలక్ష్మి, ప్రైమరీ ఇన్‌చార్జ్ షమీమ్, తులసి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## అత్తింటివారిపై చీటింగ్, వేధింపులు కేసు నమోదు

మదనపల్లెక్రైం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :

ఓ వివాహిత పిర్యాదు మేరకు అత్తింటివారిపై చీటింగ్, వరకట్నం వేధింపులు కేసు నమోదు చేసినట్లు రెండవ పట్టణ సిఐ మురళీక్రిష్ణ తెలిపారు. పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన తేజకు గత ఏడాది ఆగస్టులో విశాఖ పట్టణంకు చెందిన శశికాంత్‌తో వివాహమైంది. ఈ నేపథ్యంలో దంప తులు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. శశికాంత్ సంసారానికి పనికిరాడని నమ్మించి పెళ్లి చేశారంటూ బాధితురాలు తేజ ఆరోపిస్తూ ఇటీవల పుట్టింటికి చేరుకొంది. అనంతరం అత్తింటివారిపై రెండవ పట్టణ పోలీసులకు పిర్యాదు చేసింది. ఈ మేరకు బుధవారం శశికాంత్, ఇతని కుటుంభీకులు సుధాకర్‌రావు, పద్మలత, వికాష్, స్నేహలపై చీటింగ్, వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

## యువకునిపై కత్తితో దాడి

మదనపల్లెక్రైం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :



భార్యభర్తల గొడవలో భాగంగా అడ్డొచ్చిన ఓ యువకుడిపై భర్త కత్తితో దాడి చేసి గాయపరిచాడు. మదనపల్లె మండలం కొత్తపల్లె పంచాయితీ కొత్త ఇండ్లుకు చెందిన సద్దాంహుస్సేన్ ఆటో డ్రైవర్. ఈ నేపథ్యంలో సద్దాం ఇతని భర్యా ముంతాజ్‌లు కొద్ది రోజులుగా కుటుంబ సమస్యలపై గొడవ పడుతున్నారు. ఇదిలా వుండగా బుధవారం మాటామాటా పెరిగి గొడవ పడుతుండగా ఇదే ప్రాంతానికి చెందిన వీరి బంధువు సాధిక్(35) దంపతులకు ఆడ్డొచ్చాడు. దీంతో ఆవేశానికి గురైన సద్దాం ఇంటిలోని కత్తితో సాధిక్‌పై దాడి చేశాడు. కాగా గాయపడిన అతిన్ని స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు విచారిస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

## 23న గురుకుల ప్రవేశ పరీక్ష

ములకల చెరువు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:

ములకల చెరువు మండలంలోని బురకాయలకోట డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి జూనియర్ ఇంటర్ విద్యార్థులకు 2023-24 సంవత్సరానికి ప్రవేశ పరీక్ష ఈనెల 23న ఉదయం 10 గంటల నుంచి 12 వరకు 5వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని విద్యార్థులు తమ హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరు కావాలని ప్రిన్సిపల్ సి.సుభాషిని తెలిపారు.

## రెస్క్యు మెథడ్స్‌పై అవగాహన

పీలేరు, ఏప్రిల్ 19 ప్రభాతవార్తః



అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా చిత్తూరు మార్గంలోని రిషీ ఆర్థో ఆసుపత్రి నందు పని చేయు సిబ్బందికి రెస్క్యూ మెథడ్స్‌పై అవగాహన కార్య క్రమం నిర్వహించారు. వివిధ రకాల ఫైర్సుపై ఎలా నివారించాలి అని డెమో రూపంలో చూపించడం జరిగింది. అనంతరం కరపత్రాలను పంచిపెట్టారు. ఏదైనా ప్రమాదం జరిగితే అగ్నిప్రమాద కేంద్రంకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సుబ్బరాజు, శ్యాంప్రకాష్, నాగిరెడ్డి, యాన్, హేమాద్రిరెడ్డి, కష్ణమూర్తి, శ్రీనివాసులు, వెంకటేష్, రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

కురబలకోట, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:



చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అవుతుందని మండల టిడిపి నాయకులు జంగా రాఘవరెడ్డి, రుద్రా బాలక్రిష్ణ అన్నారు. బుధవారం కురబలకోట మండలం కనసానివారిపల్లె గ్రామ పంచాయితీలో వారు పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. చంద్రన్న మన భవిష్యత్తు మీతోనే రాష్ట్రాభివృద్ధి అన్న పేరుతో ఇంటింటికి స్టిక్కర్లను వారు అంటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని తెలిపారు. ప్రతి ఒక్కరి మీద రూ.2లక్షల మేరకు రుణభారం జగనన్న మోపడం జరిగిందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు విజన్ కలిగిన నాయకులు చంద్రబాబు మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డిశేఖర్, గడ్డం నరసింహులు, లక్ష్మన్న, బయ్యారెడ్డి, కేసిరామచంద్ర, రామ్మూర్తి పాల్గొన్నారు.

## బిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలి

కురబలకోట, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:



బిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ అఖిలపక్షాలు బిసి సంఘాల నేతల సమావేశంలో రాజంపేట టిడిపి పార్లమెంటరీ బిసిసెల్ అధ్య క్షులు సురేంద్రయాదవ్ అన్నారు. నెల్లూరులో జరిగిన బిసి ఐక్యకార్యాచరణ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర టిడిపి అధ్యక్షులు అచ్చెంనాయుడు, బీజం రవిచంద్రాలు, యనముల రామక్రిష్ణలు బిసిల సమస్యలపై చర్చించారు. రానున్న ఎన్నికల్లో బిసిల కార్యాచరణపై విధి విధానాలపై సమావేశంలో చర్చించడం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర బిసిసెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, ఉపాధ్యక్షులు మోడెం సిద్దప్ప, తులసీ ధర్‌నాయుడు, రెడ్డప్ప, సదాశివ, అంజి, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

## పక్కాగృహాలను సత్వరం పూర్తి చేయాలి

### కలెక్టర్ పిఎస్.గిరీష్

కురబలకోట, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :

జగనన్న కాలనీల్లో పక్కాగృహాలు మంజూరైన లబ్దిదారులు నిర్దేశిత గడువు లోగా గృహనిర్మాణాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పిఎస్.గిరిషా అన్నారు. బుధవారం కలెక్టర్ ముదివేడు క్రాస్, కంటేవారిపల్లె, బ్రాహ్మణవడ్డిపల్లె జగనన్న లేవుట్లలో జరుగుతున్న పక్కాగృహాల నిర్మాణాల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్దిదారులతో చర్చించారు. గృహాలను సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకొని నిర్ణయిత గడువులోగా పూర్తి చేయించేందుకు కృషి చేయాలని మండల హౌసింగ్, వివిధ శాఖ అధికారులను ఆదేశించారు. లబ్దిదారులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ భీమేశ్వర్‌రావు, బి.కొత్తకోట హౌసింగ్ డిఈ, కురబల కోట ఏఈ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## నూతన టెక్నాలజీలపై దృష్టి సారించాలి

కురబలకోట, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :



ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన టెక్నాలజీలపై దృష్టి సారించాలని ముఖ్య అతిథి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మిట్స్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ అథిఫిషియల్, ఇంటలిజెన్స్ అండ్ జాతీయస్థాయి సింపోజియమ్ రైట్ టూకెటూత్రిను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన టెక్నాలజీలపై దృష్టి సారిస్తే ప్రస్తుతం అథిషిపియల్ ఇంటలిజెన్స్ డేటాసైన్స్‌లపై ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా లభిస్తాయని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ సింపోజియమ్‌లో వివిధ ప్రాంతాల నుంచి 250మంది విద్యార్థులు టెక్నికల్ పేపర్ ఈవెంట్‌లో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో డీన్ కంప్యూటర్ సైన్స్ గౌతం చక్రవర్తి, కన్వీనర్ దుర్గాచరణ్, అశ్వని, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అధికారులు సమస్యలపై స్పందించాలి

### మండల కోఆప్షన్ సభ్యులు యోగేంద్ర

గుర్రంకొండ, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :



మండల అధికారులు ప్రజలకు సమస్యలు ఉన్నచోట వెంటనే స్పందించాలని మండల కోఆప్షన్ సభ్యులు యోగేంద్ర అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మండలసర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిపి సీతమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా యోగేంద్ర, ఆర్‌బికే అధ్యక్షులు జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యం కలగుండా సమస్యలు ఉన్నచోట వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాలని కోరారు. గుర్రం కొండలో ఇళ్ళపై కరెంటు తీగలు ఉన్నందున స్థానికులు భయాందోళనకు గురవుతున్నారని పదే పదే ట్రాన్స్‌కో అధికారులకు తెలిపిన పట్టించుకోలేదని ఎంపిటిసి ఖదీర్ సమావేశంలో నిలదీశారు. ఇందిరమ్మ కాలనీలో ప్లాట్స్ సర్వే చేసి పేదలకు ఇవ్వాలని కోరారు. గురుకుల పాఠశాలలో ఇంతకు ముందు సర్వేనెంబర్ 61లో 4.61ఈలో రెండు సర్వేనెంబర్‌ల్లో నాలుగు ఎకరాల 85 సెంట్లు అనాదీనంలో ఉంటే ఇతరులు రాత్రికి రాత్రే చెట్టు నాటేసి ఆక్రమించుకొన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఖదీర్ కోరారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన రెయిన్‌గన్‌లు, స్ప్రింకర్‌లు అప్పుడు తీసుకొన్ని బడా నేతలు ప్రభుత్వ సొత్తు అధికారులకు ఇవ్వ కుండా వారే ఇష్టానుసారంగా అమ్ముకోవడం జరిగింది. వీరిపై వెంటనే నోటీసులు ఇచ్చి రికవరీ చేయాలని ఖదీర్ కోరడం జరిగింది. గత మండల సమావేశంలో సమస్యలను పరిష్కరించడం లేదని ఎంపిడిఓను కోరడంతో ఎంపిడిఓ వెంటనే స్పందించి ఖదీర్ అడిగిన ప్రశ్నకు ఏదైనా సమస్య అడిగితే ఒక వారంలోపు సమస్యను పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వెంటకేశులు, మార్కెట్ కమిటీ ఛైర్మెన్ రవినాయక్, సర్పంచ్‌లు మస్తాన్‌రెడ్డి, లలిత, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

## రాయచోటిలో కత్తులతో సైకో వీరంగం

రాయచోటి, ఏప్రిల్ 19

ప్రభాతవార్త :



రాయచోటి పట్టణం మదనపల్లి రోడ్ హెచ్పి పెట్రోల్ బంకు సమీపంలో ఒక సైకో కత్తులతో వీరంగం చేశారు. దీంతో అక్కడున్న ప్రజలు పరుగులు పెట్టా రు పానీ పూరి సెంటర్ దగ్గర పానీ పూరి తినడానికి కాస్త పక్కకు సర్దుకోండి అనడంతో వారి పై వెంటనే సైకో కత్తితో దాడి చేయడానికి ప్రయత్నించాడు కాస్త పక్కకు జరుగు అన్న పాపానికి దాడికి పాల్పడిన సైకో వెంటనే కత్తులు బయటకి తీయడంతో ప్రాణభయంతో పరుగులు పెట్టిన కుటుంబ సభ్యులు, పానీ పూరి బండి యజమాని అక్కడ నివాసం మహిళ భయపడి పరిగెత్తినప్పు డు ఆటో ఢీకొంది తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడింది. ప్రక్కకు జరుగు అన్న వెంటనే సైకో కత్తులు తీయడం వెనుక వేరే ఎవర్నైనా చంపడానికి వెళ్తున్నాడా అంటూ ప్రజలలో పలు అనుమానాలు స్థానికుల సమాచారం మేరకు సకాలంలో స్పందించిన పట్టణ సిఐ సుధాకర్ రెడ్డి, సైకో ని అదుపులోకి తీసుకున్న పోలీసులు.

## రంజాన్ కానుకగా దుస్తులు పంపిణీ

బి.కొత్తకోట, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:



బి.కొత్తకోట మండల కేంద్రం దర్గా వీధిలో ఉండే మున్నిశారీస్ సెంటర్ యజమాని బాలాజీ రంజాన్ పండగ సందర్భంగా నగర పంచాయతీ కార్మికు లకు రంజాన్ కానుకగా దుస్తులు పంపిణీ చేశారు. ఉదయం బాలాజీతో పాటు ఉప సర్పంచ్ మాలిక్ చేతుల మీదుగా 65 మంది మున్సిపల్ కార్మికులకు, నిరుపేదలకు దుస్తులు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వారి దాతృత్వాన్ని స్థానిక ముస్లిం సోదరులు, ప్రజలు, కార్మికులు, నిరుపేదలు ప్రశంసలు కురిపించారు.

## బీసీ ఐక్య కార్యాచరణ రౌండ్ టేబుల్ సమావేశంలో బిసి నాయకులు

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:



నెల్లూరులో కస్తూర్బా దేవి గార్డెన్‌లో బుధవారం జరిగిన అన్ని పార్టీల జోనల్ బీసీ ఐక్య కార్యాచరణ రౌండ్ టేబుల్ సమావేశానికి అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం నుంచి టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి శంకరప్ప జయరాం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు బడుగు వాసుదేవుడు సహకార సంఘం రాష్ట్ర బీసీల అధ్యక్షుడు మల్ల రామాంజనేయులు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మూగి వెంకటరమణ, బీసీ నాయకులు పీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నా యుడు, మాజీ శాసనసభ స్పీకర్ ఎనమల రామకృష్ణుడు మాట్లాడుతూ జ్యోతి రావు పూలే ఆశయాలకు అనుగుణంగా మనమందరం నడుచుకోవాలని 50శాతం కోటా కోసం పోరాటం చేస్తామని బీసీలకు రావాల్సిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కోటా దక్కించుకుంటామని ఐక్యవేదికలో ప్రసంగించారని బీసీ నాయకుడు శంకరరావు, జయరాం తెలిపారు.

## అన్ని ప్రమాదాలపై ప్రభుత్వ డాక్టర్లకు అవగాహన

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:



అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లకు నర్సులకు, సెక్యూరిటీ సిబ్బందికి ఆసుపత్రికి వచ్చిన ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని లక్కిరెడ్డిపల్లె అగ్నిమాపక అధికారి జేసీ బా హుసేయ్య పేర్కొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో అగ్నిప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్త లను సిబ్బందికి, డాక్టర్లకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు లిఫ్టులు వాడరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మ్యాన్ సుదర్శన్‌రెడ్డి, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రానికి ఇదేం కర్మకు అపూర్వ స్పందన

బి.కొత్తకోట, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:



బి.కొత్తకోట మండలంలో తెదేపా ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తున్నట్లు రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి మోటుకు శివ తెలిపారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ ఆదేశాల మేరకు మండలంలోని గట్టు పంచాయతీ గట్టు, నల్లగుట్టపల్లి, కొత్తపల్లిలో రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమం ముమ్మరంగా చేపట్టా రు. ప్రజలలో వైసీపీ వ్యతిరేకత ఎలా ఉందని ఆరా తీశారు. ప్రతి ఇంటి దగ్గరకు వెళ్లి టీడీపీ పార్టీ మళ్లీ రావాలని చంద్రబాబు సీఎం కావాలని ఇక నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వండని తరువాత మీ నంబరుకు టీడీపీ హెడ్ ఆఫీస్ నుంచి ఫోన్ ద్వారా మీతో మాట్లాడతారని ప్రచారం చేశారు. ఇలా ప్రచారం చేయడం వలన ప్రజలలో మంచి స్పందన వస్తున్నదని ఆయన తెలిపారు. ప్రభుత్వం డీజిల్, గ్యాస్, ఆర్టీసీ ఛార్జీలు, నిత్యావసర ధరలు పెరుగు దలతో ప్రజలపై పెను భారం మోపారని ప్రజలకు వివరించారు. సీఎంగా చంద్రబాబును గెలిపిస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్య క్షుడు అంజి, గట్టు గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డన్న, శీతివారిపల్లి రెడ్డప్ప, మహబూబ్‌బాషా, వెంకట నారాయణ, జగదీష్, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీడీపీలో చేరిన వ్యాపారవేత్త కత్తి రవీంద్ర

కడప వైద్యవిభాగం, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:



కడప నగరంలో ప్రముఖ వ్యాపారవేత్త కత్తి రవీంద్ర టీడీపీలో చేరారు. మంగళవారం నగరంలోని పుత్తా ఎస్టేట్ లో జరిగిన టీడీపీ నాయకులు జోన్-5 సమీక్ష సమావేశంలో టీడీపీ జాతీయ నాయకుడు నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా కత్తి రవీంద్రకు పార్టీ కండువా వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీలో ఇంకా చాలా మందిని తీసుకు రావాలని పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ కడప నగర ఇన్‌ఛార్జి అమీర్‌బాబు, జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రవీంద్ర, మిత్రులు, బంధువులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## రాష్ట్రం అభివృద్ధి దిశగా వెళ్లాలంటే చంద్రబాబు సీఎం కావాలి

ములకల చెరువు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:



రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని ఆయా పంచాయతీల యూనిట్ ఇన్‌ఛార్జిలు జేసీబీ సుధాకర్ నాయుడు, రమణమూర్తి అన్నారు. బుధవారం నియోజకవర్గ తెదేపా బాధ్యుడు శంకర్ యాదవ్ ఆదేశాల మేరకు మండల పార్టీ కన్వీనర్ పాలగిరి సిద్ద ఆధ్వర్యంలో మండలంలోని మద్దినాయునిపల్లె, పెద్ద పాల్యం, ములకల చెరువు పంచాయతీల్లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వ్యతిరేకత పాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్తు, బస్ ఛార్జిలు పెంచి సామాన్యులపై భారం మోపిన ఘనత వైకాపాదే అన్నారు. రానున్న ఎన్నికల్లో తెదేపా విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు చెన్నకేశవనాయుడు, రెడ్డప్ప, శివన్న, చంద్రప్ప, రామలింగా రెడ్డి, మల్‌రెడ్డి, ఉమాయికుమార్, హరి, కట్టా హరి, చెన్నకృష్ణ, కేశవులు, సోము, శ్రీనివాసులు, రవి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## అగ్నిమాపక సేవలపై అవగాహన పొందండి

ములకల చెరువు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:



అగ్నిమాపక సేవలపై ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో అవగాహన పొందాలని లీడింగ్ ఫైర్‌మెన్లు కృష్ణయ్య, గణేష్ కుమార్, వీరభద్రారెడ్డి పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బందికి అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా చేపట్టాల్సిన జాగ్రత్తలపై వారికి వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## మొలకలచెరువు సీఐ సేవాభావం

పీలేరు, ఏప్రిల్ 19 ప్రభాతవార్తః



మొలకలచెరువు సీఐ సాదిక్ అలీ తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం పీలేరు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో కొంత మంది నిరుపేద ముస్లీం మైనారిటీ కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. సాదిక్ అలీ ఎస్సైగా పీలేరు నుంచే విధులు ప్రారంభించిన నేపథ్యంలో పీలేరులో పట్టణంపై ఉన్న మమకారంతో ఎన్నో పుణ్యకార్యక్రమాలు చేశారు. ప్రతి సంవత్సరం రంజాన్ పండుగ సందర్భంగా పేదలకు దాన ధర్మాలు చేస్తుం టారు. పవిత్రమైన రంజాన్ నెల పురస్కరించుకుని పేద, ధనిక తేడా లేకుండా ఈదుల్ పితర్ పండుగను ఆనందోత్సవాలతో జరుపుకోవాలని, పండుగపూట నిరుపేదలు కూడా ఒక పూట పౌష్టికాహారం కడుపునింపాలనే ఉద్దేశ్యంతో తనకు ఉన్నంతలో సాయం చేయడం సంతప్తిని ఇస్తుందని సీఐ సాదిక్ అలీ తెలిపారు.

## ప్రధానిమోడీ పాలనకు అనర్హుడు

### మోడీకి మోకరిల్లుతున్న జగన్

పీలేరు, ఏప్రిల్ 19 ప్రభాతవార్తః



కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రధాని మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని ప్రధానిమోడీ పాలనకు అనర్హుడని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు నరసింహులు శ్రీనివాసులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వైఫల్యాలపై వామపక్షాలు ఆధ్వర్యంలో తలపెట్టిన జీపుజాతాను పీలేరు అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మోదీ నిరంకుశంగా ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ అమ్మకానికి పెట్టారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని విదేశాలలో మూలుగుతున్న నల్లధనాన్ని తెచ్చి కుటుంబానికి రూ.15లక్షలు ఖాతాలో జమచేస్తానని ప్రజలను మోసగించారని విమర్శించారు. అండదండలతో ఆదాని ఏవిధంగా లక్షలుకోట్లు సంపాదించాడో హిండెన్‌బర్గ్ నివేదిక బట్టబయలు చేసిందని గుర్తచేశారు. గ్రామీణ పేదలకు ఆధారమైన ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేయటానికి కుట్ర చేశారన్నారు. రాష్ట్రానికి మోదీ తీరని ద్రోహం చేశారని, ప్రత్యేక హోదా, పోలవరం నిధులు ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారం, పరిహారం చెల్లింపు, అమరావతి రాజధాని నిర్మాణం, రైల్వేజోన్ రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ వంటి హామీలన్నీ పక్కన పెట్టేశారని మండిపడ్డారు. సీబీఐ, ఈడీ, ఈసీ వంటి రాజ్యాంగ బద్ద సంస్థలను తమ జేబు సంస్థలుగా మార్చుకున్నారని విమర్శించారు. దేశంలో ఆరాచక పాలన కొనసాగు తోందన్నారు. ప్రజా వ్యతిరేక, నిరంకుశ మతోన్మాద బీజేపీని సాగనంపాలని పిలుపు నిచ్చారు. పేదల పక్షాన పోరాడేది వామపక్షాలు మాత్రమే నన్నారు కార ్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, కష్ణప్ప, సాంబ శివ, టీఎల్ వెంకటేష్, నరసింహులు, సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

దువ్వూరు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:



మండల పరిధిలోని చింతకుంటలో ఏర్పాటు చేసిన ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో స్థానిక ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ప్రార్థనల ద్వారా అల్లాహ్‌కు దగ్గరయ్యేందుకు రంజాన్ పేరిట మానవాళికి అద్భుతమైన అవకాశం కల్పించిందన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల ఆత్మీయత, స్నేహ భావాన్ని పెంపొందిస్తాయన్నారు. ఎర్రబల్లె గ్రామంలో నూర్‌బాషా సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీలు ప్రతాప్‌రెడ్డి, ఖాదర్‌బాషా, చింతకుంట సర్పంచ్ వీరారెడ్డి పాల్గొన్నారు.

## మాయల మాంత్రికుడు ముఖ్యమంత్రి

కడప వైద్యవిభాగం, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:



మాయల మాంత్రికుడు ముఖ్యమంత్రి అనితెదేపా నగర ఉపాధ్యక్షుడు కొండా సుబ్బయ్య, ఎల్.శివశంకర్‌రెడ్డి అడ్వకేట్ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. అలా ఎందుకన్నామంటే జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తన చిన్నాన్నను చంపింది చంద్రబాబు అతని మనుషులే అని నారా వారి రక్త చరిత్ర అని వారి సాక్షి పేపరులో బ్యానర్ ఐటంగా రాసుకున్నాడు. ప్రజలపైన పన్నులు, కరెంటు, బస్సు ఛార్జీలు, నిత్యావసర ధరలపైన బాదుడే బాదుడు అన్నాడు. ఉద్యోగస్థులకు పీఆర్‌సీ అది ఎంత పని వారంలో అయిపోతుందన్నాడు. పోలవరాన్ని మేము అధికారంలోకి వస్తే చేస్తానన్నారు. ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ అన్నాడు. నేను అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా తెస్తామన్నాడు. ఈ రోజు అధికారంలోకి వచ్చిన తరువాత చిన్నాన్న ఎవరు చంపారు, ఎవరు కుట్లేశారు, గొడ్డలి పోటు గుండెపోటుగా ఎలా మారింది. సీబీఐ విచారణ రద్దు అని ఎవరన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ అర్థమైందన్నారు. ఇలా ప్రతి విషయంలో మాయల మాంత్రికుడిగా మాట్లాడడం ఆయనకే చెల్లిందన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు నాదెళ్ల దస్తగిరి, జయశేఖర్, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, కుంట శివ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సివిల్ జడ్జీలు బదిలీలు

కడప లీగల్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:

జిల్లా న్యాయ సేవా సాధికారిక సంస్థ కార్యదర్శిగా, సీనియర్ సివిల్ జడ్జీగా పనిచేస్తున్న శ్రీమతి కవితను కడపలో ఉన్న సీనియర్ సివిల్ జడ్జీ కోర్టుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఆమె స్థానంలో ఎవరినీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా నియమించలేదు. సీనియర్ సివిల్ జడ్జీగా పనిచేస్తున్న హేమలతను ప్రకాశం జిల్లా ఒంగోలులోని అదనపు సీనియర్ సివిల్ జడ్జీగా హేమలతను బదిలీ చేశారు. ఆమె స్థానంలో కడపలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కవితను నియమించారు. రాజంపేట కోర్టులో ఉన్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జీ ఎన్.సరస్వతిని తూ.గో.జిల్లా సీతాపురంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు బదిలీ అయిన స్థానాలలో జడ్జీలు బాధ్యతలు చేపట్టాల్సి ఉంది.

## బిసిల ఐక్యత కార్యచరణ సమావేశం

నందలూరు, ఏప్రిల్ 19

ప్రభాతవార్త



బిసి ఐక్యత వర్ధిల్లాలని తెలుగుదేశం పార్టీ బిసిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటి సుబ్బరా యుడు అన్నారు. బుధవారం నెల్లూరులో జరిగిన బిసి ఐక్యవేదిక సభలో తెలుగుదేశంపార్టీ బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లు రవీంద్రను కలిసి భవిష్యత్తులో పార్టీ ఏవిధంగా బలపడాలో అందుకు బిసిలు అందరూ ఐక్యంగా కృషి చేయాలని వారు తెలిపారు. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ విజయం సాధించడం తథ్యమన్నారు. అందుకు కలిసికట్టుగా పనిచేయాలని ఆయనతో చర్చించారు.

**పాసుపోర్టు పోయినది**

వెన్నపూస నిరంజన్ కుమార్ రెడ్డి s/o వి. మల్లికార్జున రెడ్డి, డి.నెం. 1/73-ఎ, ఎర్రముక్కపల్లె, కడప సిటి, వైఎస్ ఆర్ కడప జిల్లా, ఎ.పి. పాసుపోర్టు నెం. K5526085 పాసుపోర్టు వై.జంక్షన్ జిరాక్స్ సెంటర్ వద్ద పోయినది. దొరికినచో ఈ క్రింది నెంబర్‌కు తెలుపగలరు. 9182019933,

ఆర్.ఓ.సి. నెం. 1394/ 1/ 2020 తేది : 18-04-2023

**మదనపల్లె పురపాలక సంఘము**

**ఈ-ప్రొక్యూర్మెంటు Re short టెండరు నోటీసు**

మదనపల్లె పురపాలక సంఘము నందు క్రింద తెలిపన పనులకు గాను ఈ-ప్రొక్యూర్మెంటు ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది.

| వ.నెం. | Funds | Tender ID Nos. | పనుల సంఖ్య | పనిఅంచనాలు మొత్తం(ECV) |
|---|---|---|---|---|
| 1. | Gen. Funds | 610397, 610395, 610392 610389, 610396, 610381, 610387, 610383 | 8 | 33.39 లక్షలు |

పై పనులకు సంబంధించిన పూర్తి వివరముల కొరకు వారి నందు చూడవలెను మరియు ఆఫీసు పనివేళలందు సంబంధిత అధికారులను సంప్రదించగలరు.

బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ చేసుకొనుటకు మొదలు తేది : 18.04.2023 : 11.00 A.M.

బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ చేసుకొనుటకు చివరి తేది : 26.04.2023 11.00 A.M.

బిడ్ డాక్యుమెంట్ స్వీకరించుటకు చివరి తేది : 26.04.2023 11.00 A.M.

షరతులు : ఏ కారణము తెలుపకుండా టెండరును పాక్షికముగా కాని, పూర్తిగా కాని రద్దుపరచుటకు/నిరాకరించుటకు కమీషనరు వారికి పూర్తి అధికారములు కలవు.

కమీషనరు. మదనపల్లె పురపాలక సంఘం

## హెల్త్ సెక్రటరీలపై ఆరోపణలు మానుకోవాలి

**మదనపల్లె, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**



హెల్త్ సెక్రటరీలపై అనవసరమైన ఆరోపణలు మానుకోవాలని గ్రామ, వార్డు సచివాలయ యూనియన్ కోరింది. బుధవారం హెల్త్ సెక్రటరీస్ సమస్యలు పరిష్కరించాలని ఆ శాఖలను వేధిస్తున్నారని చేస్తున్న ఆరోపణలు ఖండిస్తూ ఏపి గ్రామ సచివాలయ హెల్త్ సెక్రటరీస్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర సమితి పిలుపు మేరకు రామారావుకాలనీ పిహెచ్‌సి వద్ద నిరసన చేశారు. ఈసందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లీలావతి మాట్లాడుతూ కరోనా సమయం లో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పలు సమస్యలతో స్పెషల్ డ్రైవ్ అంటూ రకరకాల సర్వేలు చేస్తూ మరణాలు తగ్గించడానికి కృషి చేశారని చాలామంది ప్రాణాలు కూడా కోల్పాయన్నారు. రోడుకు మూడుసార్లు బయామెట్రిక్ పెడు తున్నా అనేక ఆన్‌లైన్ యాపులు రోజు అప్లోడ్ చేస్తున్నామని తెలిపారు. ఎన్నో రకాలుగా ఆశాలను వేధిస్తుండడం భాదాకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్గర్లు, హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## మోడీ జపం చేస్తున్న వైసిపి, టిడిపి, జనసేన

### ప్రచారబేరీలో సిపిఐ, సిపిఎం నాయకులు

**మదనపల్లె, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధిని పూర్తిగా విస్మరించాయని సిపిఐ, సిపిఎం నాయకులు తెలిపారు. బుధవారం ప్రచారబేరీ కార్యక్రమం ఆరవ రోజు కొనసాగింది. పోస్టాఫీసు నుంచి బెంగుళూరు బస్టాండు వరకు కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ నాయకులు క్రిష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మురళిలు మాట్లాడుతూ వైసిపి నాయకులు ప్రజాప్రయోజనాలను పూర్తిగా విస్మరించారన్నారు. నాలుగేళ్ళలో నియోజకవర్గం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఆర్థిక అరాచకాలను కొనసాగిస్తుందన్నారు. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం కూడా బిజెపికి మద్దతు పలుకుతూ మతతత్వ విధానాలను ప్రోత్సహిస్తొందన్నారు. మదనపల్లెకు జిల్లా స్థాయి హోదాను ప్రకటించకపోవడం, రైల్వేలైన్ పక్కదారి పట్టడం నాయకుల నిర్లక్ష్యమే అన్నారు. ప్రభుత్వ భూములను కబ్జాచేస్తూ రియల్‌ఎస్టేట్ వ్యాపారాలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుమల, అనసూయ పాల్గొన్నారు.

## జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమానికి స్పందన

### కౌన్సిలర్ ఆర్‌వి.శివారెడ్డి గడప గడపకు జగనన్న స్టిక్కర్లు

**మదనపల్లె, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**



జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తొందని రెండవ వార్డు కౌన్సిలర్ ఆర్‌వి.శివారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజులుగా రెండవ వార్డులో జగనన్నే భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా గడప గడపకు వెళ్ళి వైసిపి ప్రభుత్వం నాలుగేళ్ళల్లో అమలుచేస్తున్న అభివృద్ది పథకాలు, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరిస్తున్నారు. నవరత్న పథకాలపై ప్రతి ఇంటి తలుపు, గోడలకు ముఖ్యమంత్రి జగనన్న స్టిక్కర్లును అతికిస్తున్నారు. కౌన్సిలర్ శివారెడ్డి ఏ ఇంటికి వెళ్లిన ప్రజలు ఆప్యాయంగా పలకరిస్తూ స్వాగతం పలుకుతున్నారు. గృహసారధులు, వైసిపి నాయకులు, శివారెడ్డితో పాటు ఇంటింటికి వెళ్లి జగనన్న స్టిక్కర్లు అంటించి సిఎం అవలం బిస్తున్న పథకాలపై వివరిస్తున్నారు. మళ్ళీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించు కోవాలని కోరుతున్నారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా నయకత్వాన్ని ప్రజలు కోరుకొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆర్‌వి.శివారెడ్డితో పాటు నాయకులు మల్‌రెడ్డి, ముత్రా వెంకట రమణారెడ్డి, శ్రీరాములురెడ్డి, రామిశెట్టి కేశవ, గంజికుంట బాబు, లక్ష్మారెడ్డి, రమేష్‌రెడ్డి, బాషా, మాధవరెడ్డి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## బిటి కళాశాల మైదానంలో ఎస్‌ఎం లైవ్‌షిప్ ఏక్వేరియం

**మదనపల్లె, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**



పట్టణంలోని బిటి కళాశాల మైదానంలో ఎస్‌ఎం లైవ్‌షిప్ ఏక్వేరియం ఎగ్జిబీషన్‌ను బుధవారం ఎమ్మెల్యే నవాజ్ బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడతూ మదనపల్లె ప్రజలను ఆహ్లాదపరిచే విధంగా గతంలో ఎప్పుడూ చూడని విదంగా ఎగ్జిబీషన్ లైవ్‌షిప్ అక్వేరియం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆనందపరిచే ఎన్నో రకాల వస్తువులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పిల్లలను తల్లిదండ్రులు ఏర్పాటుచేసిన ఎగ్జిబీషన్‌లో తీసుకురావడం పిల్లలు ఎంతో సంతోషంగా గడిపేందుకు వీలుంటుందన్నారు. ఈ ఎగ్జిబీషన్‌ను నిర్వాహకులు మద్దయ్యగాకిపల్లెకు చెందిన మూర్తి మాట్లాడుతూ ఇలాంటి ఎగ్జిబీషన్ బెంగుళూరు, బొంబాయి, పూనే వంటి నగరాలతో పాటు రాష్ట్రంలోని పలుచోట్ల ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా దీనిని ఉపయోగించుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి పాల్గొన్నారు.

## ముస్లింల ప్రార్థనలకు ఈద్గా సిద్దం

**కలికిరి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**



రంజాన్ పండగ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రార్థనలు చేసుకునేందుకు కలికిరి-కలకడ రోడ్డు మార్గంలో ఈద్గా సిద్దమైంది. గతంలో ముస్లిం సోదరులు ప్రార్థనలు జరుపుకునేందుకు కలికిరిలో స్థలంలేక ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను ఇటీవల మండల ఎంపిపి వేంపల్లి నూర్జాహన్ ఆమె తనయుడు వైసిపి మైనార్టీ యువనాయకులు వేంపల్లి బావాజి, పంచాయితీ వార్డు మెంబర్ వేంపల్లి ఖాదర్‌బాషాలు రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకురావడం జరిగింది. స్పందించిన ఎంపి ఈద్గా నిర్మించేందుకు స్థలం కొనుగోలుకు సొంత నిధులు రూ.14లక్షలు ఇవ్వడం జరిగింది. ఈ స్థలంలో కలికిరి మండల పరిషత్ నిధులతో ఈద్గానిర్మాణం రక్షిత మంచినీటి బోరు ఏర్పాటు చేసి పనులు పూర్తి చేశారు. రంజాన్ పండగ సందర్భంగా ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు ఈద్గా సిద్దమైంది. అంతేకాకుండా మండలంలోని మసీదుల్లో మౌళిక వసతుల కోసం ఎంపి మిథున్‌రెడ్డి రూ.48లక్షలు నిధులు మంజూరు చేశారు. దీంతో మసీదుల్లో కూడా పనులు పూర్తి అయ్యాయి.

## నేడు ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**కలికిరి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**

మండలంలోని ముస్లిం సోదరులకు కలికిరి-కలకడ రోడ్డు మార్గంలో ఉన్న హేమాంబరాచారి కళ్యాణ మండపంలో రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి, పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలు రంజాన్ పండగ సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు కలికిరి మండలం వైసిపి యువనాయకులు వేంపల్లి బావాజి పంచాయితీ వార్డుమెంబర్ వేంపల్లి ఖాదర్‌బాషాలు తెలిపారు. ఈకార్యక్రమానికి మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మెన్ డాక్టర్ ఇక్బాల్ అమ్మద్‌ఖాన్, రాష్ట్ర ఏఎండిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డి హాజరు అవుతారని వారు పేర్కొన్నారు.

## అధినేతతో టిడిపి నాయకులు

**చాపాడు ఏప్రిల్ 19, ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రెండవ రోజు బుధ వారం బద్వేల్ నియోజకవర్గ కార్య కర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో, టిడిపి అధికార ప్రతినిధి మునిశేఖర్ రెడ్డి తో పాటు, చాపాడు మాజీ టిడిపి మండల అధ్యక్షుడు. వై వెంకట సుబ్బారెడ్డి, తప్పెట ఓబాయపల్లె రవిశంకర్ రెడ్డి, పలువురు టిడిపి నాయకులు. అధినేతను కలిసిన వారిలో ఉన్నారు.

## మాజీ సీఎంకు సమస్యల వినతి

**జమ్మలమడుగు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**



జమ్మలమడుగు నియోజకవర్గం పెద్దముడియం మండలంలోని రాజోలి ప్రాజెక్టు సమస్యపైన మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడును జమ్మలమడుగు తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజోలి బాధిత రైతులతో కలిశారు. పెద్దముడియం మండలం నెమళ్లదిన్నె గరిశలూరు, బలపనగూడూరు, చిన్నముడియం, ఉప్పలూరు రైతులతో చంద్రబాబునాయుడు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డిని జమ్మలమడుగు నుంచి గెలిపించుకోవాలని, రాజోలి ప్రాజెక్టును తప్పకుండా పూర్తి చేస్తామని అలాగే భూమి కోల్పోయిన ప్రతి రైతుకు ఎకరాకు 16 నుంచి 18లక్షల రూపాయలు నష్టపరిహారం ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జమ్మలమడుగు తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి, ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి, నెమళ్లదిన్నె వెంకటేశ్వర‌రెడ్డి, చిన్నముడియం పురుషోత్తంరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, తెదేపా నాయకులు, కార్యకర్తలు, భూములు కోల్పోయిన రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు ఆంగ్ల బోధనతోనే సాధ్యం : బైరెడ్డి రవీంద్రారెడ్డి

**జమ్మలమడుగు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**



విద్యార్థుల భవిష్యత్తు ఆంగ్ల విద్య బోధనతోనే సాధ్యమవుతుందని బాలాజీ హైస్కూలు డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి, కరస్పాండెంట్ దీప్తి నిఖిలారెడ్డి సంయుక్తంగా తెలిపారు. బుధవారం స్థానిక బాలా జీ హైస్కూలులో ఇంగ్లీష్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గ భవిష్యత్తుపై ముందు ఆలోచనలతోనే తాను 1999లో ఆంగ్ల విద్యను ప్రారంభించడం జరిగిందన్నారు. నాటి నుంచి నేటి వరకు ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దడం జరిగిందన్నారు. కరస్పాండెంట్ దీప్తి నిఖిలారెడ్డి మాట్లాడుతూ మా తండ్రి రవీంద్రారెడ్డి ముందు ఆలోచనతోనే పట్టణంలో ఆంగ్ల విద్యను ప్రారంభించడం జరిగిందన్నారు. పిల్లలు ఆంగ్ల భాష మాట్లాడడం వలన తల్లిదండ్రులలో కలిగే ఆనందం వర్ణించలేనిదన్నారు. అనంతరం ప్రాంతీయ మూలాలు కలిగిన చెక్కభజన, కోలాటం ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సూర్యమిత్ర, పరిపాల నాధికారి ప్రసాద్ రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు ఖాసీం, సత్యానందం, భరత్ కుమార్, ప్రసాద్, హృషీ కేశవ, ఆచారి, బాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేరేడు చెట్లకు నిప్పు

**జమ్మలమడుగు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**



జమ్మలమడుగు మండలం దేవగుడి గ్రామానికి చెందిన రైతు మురళీ తాటి, నేరేడు చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా.మూలే సుదీర్‌రెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని రైతును పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని ఎలాగైనా పట్టుకొని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.

## ఆటో, చిరు వ్యాపారులకు అన్యాయం చేయొద్దు

**జమ్మలమడుగు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**



పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ముందు ఉన్న ఆటో కార్మికులకు, చిరు వ్యాపారులకు అధికారులు అన్యాయం చేయొద్దని వారి పొట్ట కొట్టవద్దని సీపీఎం జమ్మలమడుగు కార్యదర్శి శివ నారాయణ, సీపీఐ జిల్లా సమితి సభ్యులు ప్రసాద్, జమ్మలమడుగు మున్సిపల్ వైస్‌ఛైర్మన్ సింగరయ్య తెలిపారు. బుధవారం నాడు కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ వారితో కలిసి నిర సన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా తహసీల్దారు కార్యాలయం ముందు ఆటో, కార్మికులు, చిరువ్యాపారులు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. అలాంటిది దుకాణాలు తొలగించాలనడం అన్యాయమన్నారు. మున్సిపాలిటీకి పన్నులు కడుతున్నారని వారికి స్టాల్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కార్మికుల వద్దకు వచ్చి అధికారులతో మాట్లాడారని తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్నారనీ, వారికి కార్మికులు, చిరు వ్యాపారుల తరుపున ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీవై ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, సీపీఎం సీపీఐ నాయకులు ప్రసాద్‌రెడ్డి, విజయ్, ఆదాం, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్ కుమార్, నన్నే పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

**పెద్దమండ్యం ఏప్రిల్ 19 ప్రభాతవార్త**



మహిళలు అన్నిరంగాల్లో ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమని అందుకే ఆసరాగా నిలవాలని మహిళలకు మూడవ విడత డ్వాక్రా రుణాలు 5.07కోట్లు చెక్కును ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి గ్రూపుసబ్యులకు అందించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికష్టాలు, అడ్డంకులున్నా స క్షేపథకాలు ఆపేదే లేదన్నారు. ప్రజల సంక్షేమమే జగన్ లక్ష్యమని నిమోజకవర్గం ఎన్నడూ లేని విధంగా అభివృద్ది చేయడం జరిగిందన్నారు. తిరిగి జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. సింగల్‌విండో అధ్యక్షులు కలిచెర్ల సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం మెట్టప్రాంతం కావడంతో హంద్రీనీవా కాలువ ద్వారా నీరు అందిచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపిపి పూర్ణచంద్రికా రమేష్ మాట్లాడుతూ మనజగన్‌అన్న చేస్తున్నపరిపాలనా సంక్షేమపథకాల అమలును చూసి ప్రక్క రాష్ట్రాలు జగన్ అడుగుజాడల్లో నడవాలని కోరుకొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసి పీరమ్మ, క్రిష్టారెడ్డి, ఎంపిడివో శ్రీధర్, తాసీల్దార్, సర్పంచులు, ఎంపిటీసీలు, మహిళలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ఒక్కరి ప్రాణమైనా కాపాడుదాం

### రోడ్డు ప్రమాదాలపై డిఎస్‌పి కేశప్ప సమీక్ష

**మదనపల్లెక్రైం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**



ఒక్కరి ప్రాణమైనా కాపాడుదాం అంటూ రోడ్డు ప్రమాదాలపై డిఎస్‌పి కేశప్ప మున్సిపల్, ఆర్అండ్‌బి, పంచాయితీరాజ్ రహదారుల శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిఎస్‌పి కేశప్ప మాట్లాడుతూ ఇటీవల ఎక్కువగా వాహన ప్రమాదాలు జరుగుతున్నాయని ఏ ప్రాంతంలో అయితే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతూన్నయో ఆ ప్రాంతంలో నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓ ప్రమాదం జరిగితే అందు లో ఎవరైనా చనిపోతే ఆ కుటుంబం వీధిన పడే అవకాశం ఉందన్నారు. వాహన దారులు, డ్రైవర్లు యజమానులతో సమావేశాలు నిర్వహించి రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే నష్టాలను వారికి తెలియజేయాలని సూచించారు. అతివేగం, ఓవర్ టేకింగ్, ప్రమాదకర మలుపులు వద్దే ఎక్కువగా యాక్సిడెంట్లు జరుగుతున్నా యన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలని సూచనలు ఇవ్వాలని తెలిపారు. ప్రమాదాల నివారణలో భాగంగా అధికారులు అప్రమత్తమై ప్రమాదాల్లో ఒక్కరి ప్రాణానైనా కాపాడాలని కోరారు. జిల్లా ఎస్‌పి గంగాధర్‌రావు సూచనల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణలో అందరూ భాగస్వామ్యం కావాలని సూచించారు. సమావేశంలో ఆర్టీఓ దినేష్‌చంద్ర, నేషనల్ హైవే డిఈ శివరామ్, మున్సిపల్ డిఈ పల్లవి పాల్గొన్నారు.

## బియ్యం పంపిణీ ఆలస్యం ఎందుకైంది

### – తహసీల్దార్ కళావతి ఆగ్రహం

**తంబళ్లపల్లె, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**



ప్రజలకు సకాలంలో పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం ఆలస్యం ఎందుకైందని తహసీల్దారు కళావతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలో గుండ్లపల్లి పంచాయతీలోని రెండు గ్రామాల్లో రేషన్ బియ్యం పంపిణీ ఆగిపోయింది. దీంతో స్థానిక ప్రజలు బియ్యం పంపిణీ చేయలేదని ఏం తిని బతకాలని ఉదయం తహసీల్దారు కళావతి ముందు మొరపెట్టుకున్నారు. ఎందుకు పంపిణీ చేయలేదని అక్కడే ఉన్న ట్రక్కు డ్రైవర్ రాజశేఖర్‌ను విచారించగా నా వద్ద ఉన్న స్టాక్ మొత్తం పంపిణీ చేశానని డీలర్ల వద్ద స్టాక్ లేదని చెప్పాడు. వెంటనే డీలర్లకు ఫోన్ చేసి ఎందుకు స్టాక్ తెప్పించలేదని అడిగారు. వెంటనే బియ్యం స్టాకు తరలించి ప్రతి ఒక్కరికి యుద్ధ ప్రాతిపదికన బియ్యం పంపిణీ చేయాలని డీలర్లను తహసీల్దార్ ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దారుతో మాట్లాడి రేషన్ బియ్యం సరఫరాకు సహకరించాలని కోరారు. ఇకపై రేషన్ బియ్యం స్టోర్ డీలర్లు సకాలంలో స్టాక్ తెప్పించి ట్రక్కు డ్రైవర్లకు అందించాలని హెచ్చరించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానిక ప్రజలు స్పందనపై హర్షం వ్యక్తం చేశారు.

## కార్పొరేటర్‌కు సలావుద్దీన్ కృతజ్ఞతలు

**కడప వైద్యవిభాగం, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**



కడపలో మంజుమియా సర్కిల్ అభివృద్ధికి కృషి చేసిన కార్పొరేటర్ షఫీకి ప్రముఖ సంఘ సేవకుడు సయ్యద్ సలావుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు. కడప నగరంలోని గుంతబజార్‌లో మంజుమియా సర్కిల్ అభివృద్ధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ మంజుమియ్యా సాహెబ్ ఎంతో మహోన్నతమైన గొప్ప వ్యక్తి అని మొట్టమొదటి కడప మున్సిపల్ ఛైర్మన్‌గా పని చేశారన్నారు. 1891లో డాక్టర్ మంజుమియ్యా సాహెబ్ ఎన్నో ఆస్తులను ప్రభుత్వానికి అప్పగించారన్నారు. నగర నడిబొడ్డున ఉన్న గుంత బజార్ మంజుమియ్యా పార్క్ ఎన్నో సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉండేదని, ఈ మంజుమియా సర్కిల్ ఉందని కూడా ప్రజలకు ఎవరికీ తెలియదన్నారు. కడప 31వ డివిజన్ కార్పొరేటర్ షఫీ మంజుమియ్యా పార్కు అభివృద్ధి కోసం పదే పదే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు ఏటాయించి అభివృద్ధి చేపట్టారన్నారు. మంజుమియ్యా పార్కు అభివృద్ధికి తోడ్పాటు అందించిన ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, కమిషనర్, మేయర్, కార్పొరేటర్లకు ధన్యవాదాలు తెలిపారు.

## బిసి నాయకులు బత్తల లింగమూర్తికి సన్మానం

**కడప వైద్యవిభాగం, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**



బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బీసీ భవన్ నిర్మాణ సాధన రథ సారథి బత్తల లింగమూర్తిని స్థానిక ఐటీఐ సర్కిల్ మాక్ మెడికల్ పైన నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం కార్యాలయంలో నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పత్తూరు గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సభాధ్యక్షులు గురుస్వామి మాట్లాడుతూ అవిరళ ఆశా సాధం, బీసీ భవన నిర్మాణానికి బీసీ కార్యవర్గ సభ్యుల సహకారంతో కృషి చేసిన వ్యక్తి బీసీ నాయకుడు లింగమూర్తి అన్నారు. ముగ్గురు కలెక్టర్లకు ప్రజా ప్రతినిధులకు, రెవెన్యూ అధికారులకు మూడు సంవత్సరాలుగా అనేక దఫాలుగా వినతి పత్రాలు సమర్పించి చిట్ట చివరకు అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో కడప నడిబొడ్డున పాత రిమ్స్‌లోని బీసీ భవన నిర్మాణానికి లింగమూర్తి 20 సెంట్లు స్థలాన్ని సాధించడం జరిగిందన్నారు. కడప పార్లమెంటు సభ్యులు అవినాష్‌రెడ్డి, పరిమళ నత్వాని సహకారంతో నిధులు మంజూరుకు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా లింగమూర్తి విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన కృషికి తగినట్లుసేవలు, గుర్తింపుగా మొత్తం 30 బీసీ సంఘాల నాయకులు మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి నాడు బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత గానుగపెంట హనుమంతరావు బీసీ సాంఘిక సంక్షేమ శాఖాధికారి డా.వల్లూరు బ్రహ్మయ్యల చేతుల మీదుగా పూలే సేవా రత్న ప్రశంసా పత్రాన్ని అందుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పూలే సేవా రత్న అవార్డు గ్రహీత బత్తల లింగమూర్తి కి బీసీ కుల సంఘం నాయకులు శివ యాదవ్, రామస్వామి, కల్యా సుధాకర్, గంగాధర్, మురళీకృష్ణ, గూడు సాహెబ్, త్రివిక్రం, సానే శ్రీనివాస్, ఆదినారా యణ, వెంకటేశ్వరరావు, ప్రసాద్‌రావు, ఎన్.శేఖర్, రవి, రమణ, కె.సుబ్రమణ్యం తదితరులు పాల్గొని లింగమూర్తిని సత్కరించారు.

## అత్యాచారం కేసులో తీర్పు సరైనదే

**కడప వైద్యవిభాగం, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**



మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి వారిపై అత్యాచారం జరిపితే జీవిత కాలమంతా జైల్లోనే గడుపుతామన్న భయాన్ని తీసుకురావడం ఇలాంటి తీర్పులు చూసైనా ఆకతాయిల్లో మార్పు రావాలని మహిళలను గౌరవించాలని లేకపోతే తగిన భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని రాయలసీమ మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తస్లీం, లక్ష్మీదేవి అన్నారు. బుధవారం ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గతేడాది విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మతిస్తిమితం లేని ఓ యువతిని మాయ మాటలతో మోసం చేసి అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు నిందితులకు కోర్టు విధించిన తీర్పు సరైనదే అని రాష్ట్రంలో ఎవరైనా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిం చినా, అత్యాచారాలకు పాల్పడినా వారికి ఈ తీర్పు గుర్తుకు రావాలని హత్యా చారానికి పాల్పడే వారిని మరింత కఠినంగా శిక్షించాలని వారు కోరారు.

## చిన్నారులకు బర్త్ సర్టిఫికెట్లు సిద్ధం చేయండి

**తంబళ్లపల్లె, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**



చిన్నారులకు బర్త్ సర్టిఫికెట్లు కచ్చితంగా చేయడానికి అంగన్‌వాడీలు కృషి చేయాలన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన అంగన్‌వాడీల సమీక్షలో ఎంపీడీవో ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ 0-3 సంవత్సరాల వరకు పిల్లలకు సర్టిఫికెట్లు పంపిణీకి సహకరించాలన్నారు. పిల్లలు హాస్పిటల్‌లో జన్మించారా, ఇంటి వద్ద జన్మించారా అనే విషయంపై అంగన్‌వాడీ తల్లిదండ్రుల ఇళ్ల వద్దకు వెళ్లి సమాచారం సేకరించాలన్నారు. ఇప్పటి వరకు ఎటు వంటి నమోదు కాని పిల్లలను గుర్తించి బర్త్ సర్టిఫికెట్లు పూర్తి స్థాయిలో సేకరించి విజయవంతం చేయాలని అంగన్‌వాడీలను ఆయన కోరారు. విద్యార్థుల ఆధార్ కార్డులు కూడా అప్‌డేట్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈనెల 20, 21వ తేదీల్లోపు నమోదు చేసుకొని జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ నారాయణరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్ వాడీలు పాల్గొన్నారు.

## రక్తదానం-ప్రాణదానంతో సమానం

### – మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్

**జమ్మలమడుగు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**



స్థానిక జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణీ షాలినీకి ఆపరేషన్ నిమిత్తం ఓ పాజిటీవ్ రక్తం అవసరం కాగా మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ ఛైర్మన్ మోరే లక్ష్మణ్ రావును సంప్రదించారు. వెంటనే స్పందించిన ఆయన దొరనానిపల్లెకు చెందిన ఆంజ నేయులు ఓ పాజిటీవ్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ లక్ష్మణ్‌రావు, సబహాన్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు. రక్తదాత అయిన ఆంజనేయులు, ఫౌండేషన్ ఛైర్మన్‌కు సభ్యులకు బాధితురాలు, వారి బంధువులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రక్తదాతలు, గ్రహీతలు 8297253484, 9000879801 నంబర్లను సంప్రదించాలన్నారు.

## టి.వి.ఎస్.ఎం. హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు

**మైదుకూరు ఏప్రిల్ 18, ప్రభాతవార్త**



మైదుకూరు పట్టణ పరిధిలోని టి.వి. ఎస్.యం హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా చిన్నపిల్లల డ్యాన్సులు, ఆట పాటలతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులుచే అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అబ్బురపరిచాయి. కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ మౌనిక ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల ఆట పాటలకు సమయం ఎక్కువ కేటాయించాలని, పిల్లలకు ఫోన్ ఇవ్వడం ద్వారా వారు చెడు మార్గాలకు వెళ్తున్నారని అన్నారు. భవిష్యత్ తరాలకు విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంత ఉందో అంతే తల్లిదండ్రులకు ఉండాలని, అయితే తల్లిదండ్రులు ఆదాయ వనరులు సమీకరించడంలో చూపే శ్రద్ధ పిల్లల మీద వారి భవిష్యత్ మీద చూపడం లేదని అన్నారు. ఎన్నో ఏళ్ల నుండి సమాజంలో ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలను మా స్కూల్లో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు మంచి పునాదులు వేసుకున్నందుకు తల్లిదండ్రులకు హృదయపూర్వక నమస్కారాలు తెలియ చేశారు. ఈ టి.వి.ఎస్.ఎం స్కూల్ నందు అనేక సంవత్సరాల నుండి చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలతో దేశభక్తిని పెంపొందిస్తూ అనేక మంది పిల్లల భవిష్యత్తు తరాలు మార్చిందని మంచి ఉద్యోగ స్థాయిలో ఉన్నత చదువులను ప్రోత్సహించడంలో మొదటి మెట్టు ఇక్కడినుండే ప్రారంభమైందని తెలిపారు. కార్యక్రమంలో టివి ఎస్ ఎం స్కూల్ ఉపాధ్యాయులు జయకృష్ణ, హెడ్మాస్టర్ మురళి, శివ లలిత, సాయి హైందవి, జయంతి, భూమిరెడ్డి రవికళ్యాణ్, మద్ద య్య, ప్రతాప్, సురేంద్ర, దానమయ్య, స్పందన, స్వర్ణలత, కవిత, చంద్ర కళ, పర్వీన్, సుమలత, జాస్మిన్, రేష్మ, సుజాత పాల్గొన్నారు.

## సమయస్ఫూర్తితో అగ్నిప్రమాదాలు నివారించవచ్చు

**కడప ఏప్రిల్ 19, ప్రభాతవార్త**



ప్రభుత్వ పురుషుల కళాశాలలో జంతు శాస్త్ర శాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రారంభంలో ప్రధానాచార్యులు డా. రవీంద్రనాథ్ మాట్లాడుతూ అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా ఇటువంటి కార్యక్రమం మన కాలేజీలో నిర్వహించి విద్యార్థుల భాద్యతను తెలియజేయటం ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని తెలియ జేశారు. అగ్ని మాపక కార్యాలయం జిల్లా అధికారి బసివిరెడ్డి మాట్లాడుతూ వివిధ రకాల ప్రమాదాలు సమయ స్ఫూర్తితో ప్రమాధాన్ని నివారించటంతో ఎలా బయట పడవచ్చో చక్కగా ఉదాహరణలతో చూపించారు. ప్రమాదాలైన గ్యాస్ అడవి ప్రమాదాలు విద్యుత్తు ప్రమాదాలు పెట్రోలియం బంకులో జరిగే ప్రమా దాలు గాస్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మన ఇంట్లో ప్రమాదాల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రవి శేఖర్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వైస్ సావిత్రి శివరామకృష్ణ అగ్నిమాపక సిబ్బంది అహ్మద్ శివకృష్ణ అధ్యాపకులు రాజేశ్వరి కల్పన సునీత నాగేంద్ర కుమార్ శ్రీనివాసులు బోధనేతల సిబ్బంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు

## మానవత్వం చాటుకున్న టుటౌన్ సీఐ ఇబ్రహీం

**ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**



వివేకానంద కాలనీకి చెందిన షబానాకు ఆసియా(9), సాహిన్(7) ఇద్దరు పిల్ల లున్నారు. భర్త చనిపోవడం వల్ల కుటుంబం భారమై కూలి పని చేసుకొని పోసిస్తూ ఇద్దరు పిల్లలు ఉన్నందువల్ల ఆమెకు వచ్చే కూలి డబ్బులు అంతంత మాత్రమే సరిపోయేవి. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో ఇరుగు పొరుగున ఉండే మహిళలు ఆమెకు సలహా ఇవ్వగా టుటౌన్ ఈఐ ఇబ్రహీం పవిత్ర రంజాన్ సందర్భంగా నిరుపేదలైన చాలా మందికి ఆయన సహాయం చేస్తున్నారని ఆమెకు తెలిపారు. ఇది తెలుసుకున్న షబానా టుటౌన్ సీఐ ఇబ్రహీంకు ఫోన్ చేసి ఆమె స్థితిగతులు గురించి ఆయనకు క్లుప్తంగా వివరించారు. రంజాన్ పండగ చేసుకొని కూడా తమ వద్ద డబ్బులు లేవని ఆమె ఆయనతో చెప్పగా మానవత్వంతో స్పందించిన టుటౌన్ సీఐ ఇబ్రహీం వెంటనే స్పందించి ఆమెను పిలిపించి ఆమెకు బియ్యం ప్యాకెట్, నిత్యావసర సరుకులు, చిన్న పిల్లలు ఇద్దరికి కొత్త బట్టలను అందజేశారు. షబానా టుటౌన్ సీఐకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది బాబా ఫకృద్దీన్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## అన్ని వర్గాలను ఆదుకుంటాం

### – సప్తగిరి బ్యాంక్ మేనేజర్ మోహన్

**తంబళ్లపల్లె, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**



మండలంలోని అన్ని వర్గాల ప్రజ లను రుణ సౌకర్యంతో ఆదుకుంటామని సప్తగిరి బ్యాంక్ మేనేజర్ ఎం.మోహన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తంబళ్లపల్లె మండలం చాలా మంది వెనకబడిన ప్రాంతంగా ఎంచుకొని స్థానిక ప్రజల సౌకర్యార్థం సప్తగిరి బ్యాంక్ బ్రాంచి ప్రారంభించడం జరిగిందన్నారు. బ్రాంచ్ కార్యాలయం ప్రారంభించి మూడు మాసాలలోనే బ్యాంకు లావాదేవీలు ఆశించిన స్థాయిలో రావడం గర్వకారణంగా ఉందన్నారు. ఇప్పటికి సుమారు రూ.36 లక్షలు, ఇతర వ్యాపార సంబంధ రుణాలు రూ.40లక్షలకు పైగా పంపిణీ చేశామన్నారు. రాబోయే రోజుల్లో వ్యవసాయ సంబంధిత రుణాలతో పాటు ఇంటి స్థలాలపై, మార్ట్‌గేజ్‌పై రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళా సంఘాలకు విరివిగా రుణ సౌకర్యంతో పాటు పాడి ఆవులు, గొర్రెలు, మేకలు, చిన్న చిన్న వ్యాపారులకు రుణాలు ఇస్తామన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఎడ్యుకేషన్ రుణ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. మా బ్యాంకులో ఆర్థిక లావా దేవీలు జరిపితే బ్యాంకు నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## మే నుండి రోజుకోసారి త్రాగునీరు అందిస్తాం

### ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

**ప్రొద్దుటూరు ఏప్రిల్ 19, ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు పట్టణంలో 15 సంవత్సరాలుగా ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తున్న త్రాగు నీటి సమస్య అధిగమించే క్రమంలో అమృత పథకం ద్వారా శాశ్వత త్రాగునీటి పనులు చివరి దశకు చేరుకున్నాయని మే నుండి రోజు ఒక సారి ప్రజలకు త్రాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి వెల్లడించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ పబ్లిక్ హెల్త్ అధికారులతో అభివృద్ధి పథకం ద్వారా జరుగుతున్న పనులపై ఆయన సమీక్షించారు ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేపట్టిన శాశ్వత త్రాగునీటి పథకం చివరి దశకు చేరుతుందని బుధవారం మైలవరం నుండి నీటి శుద్ధి కేంద్రంలోకి నీరు చేరుకోవడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ పథకం వల్ల ప్రొద్దుటూరు ప్రజలకు శాశ్వతంగా త్రాగునీరు అందుతుందని శ్రీశైలం డ్యామ్ ఎండితే తప్ప ప్రొద్దుటూరు ప్రజల ఎండదని తెలిపారు ఈ పథకం పూర్తి కావడానికి అహర్నిశలు శ్రమిం చిన మున్సిపల్ పబ్లిక్ హెల్త్ అధికారులకు సహకరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ చెన్నకేశవరెడ్డి మున్సిపల్ కమిషనర్ పివి రమణయ్య మున్సిపల్ ఇంజనీర్ సాయి కృష్ణ డి ఈ దస్తగిరి దస్తగిరి రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## వైసిపి పార్టీ జిల్లా కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**రాయచోటి టౌన్, ఏప్రిల్ 19ప్రభాతవార్త:**



రాయచోటి పట్టణంలోని రింగ్‌రోడ్డు సమీపంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయ నిర్మాణ పనులను బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. పనుల నాణ్యతపై ఆరా తీశారు. త్వరితగతిన పనులును పూర్తి చేయాలని శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. మున్సిపల్ ఛైర్మెన్ ఫయాజ్‌బాషా, సివిల్ సప్లైస్ స్టేట్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, మండల బిసి నాయకుడు పల్లపు రమేష్, గౌస్‌ఖాన్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, జానం రవీంద్ర యాదవ్, వాల్మీక సంఘం జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వైసిపి ప్రభుత్వం మైనార్టీలకు చేసంది శూన్యం

**– మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్‌కుమార్‌రెడ్డి**

**గాలివీడు, ఏప్రిల్ 19ప్రభాతవార్త:**



వైసిపి ప్రభుత్వం మైనార్టీలకు చేసింది శూన్యమని రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ మాజీ రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గోపనపల్లె, పేంపల్లి పంచాయతీల్లో పర్యటించి ముస్లిం మైనార్టీలకు రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు రంజాన్ తోఫా, షాదిమాల్, మౌజన్లకు ఇమామ్‌లకు జీతాలు ఇచ్చే పద్దతిని టిడిపి ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టారన్నారు. పేదవారి పెండ్లికి దుల్హా పథకం ద్వారా 50 వవేల రూపాయల నగదును అందజేశామన్నారు. విదేశి విద్య పథకం ద్వారా పేద ముస్లింలకు 10 లక్షల రూపాయలు స్కాలర్‌షిప్ కింద అందజేశారని తెలిపారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ముస్లిం మైనార్టీల అభివృద్ధికి చేసింది శూన్యమని తెలిపారు. మైనార్టీలకు ఈ ప్రభుత్వంలో రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి వెంకటనారాయణరెడ్డి, సర ్పంచ్ పార్థసారధి రెడ్డి, మాజీ సర్పంచ్ గీదర ఈశ్వర్‌రెడ్డి, టిడిపి నాయకులు డాక్టర్ రామచంద్రారెడ్డి, రామాంజల్‌రెడ్డి, గీదర ధర్మారెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కెఎస్‌ఆర్‌ఎమ్ కళాశాలలో నేడు పూల్ క్యాంపస్ డ్రైవ్

**కడప, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :**

కెఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో పూల్ క్యాంపస్ డ్రైవ్ ప్రాంగణ ఎంపికలు 20.04.2023వ తేదీన నిర్వహించనున్నట్లు కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ వివిఎస్‌ఎస్ మూర్తి తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికలకై ప్రముఖ కంపెనీ ఆల్ డిక్సన్ LED TV Assembling కంపెనీ (తిరుపతి) వారు రానున్నట్లు తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికలకు కళాశాలలో 2021, 2022, 2023 సంవత్సరంలలో బీ.టెక్ ఈసీఈ, ఈఈఈ ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులు పాల్గొని, ఈ ప్రాంగణ ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట లేటెస్ట్ రెజ్యూమ్‌తో పాటు, తమ యొక్క ధ్రువీకరణ పత్రాలను ఒక కాపీ జిరాక్స్ తీసుకురావాల్సిందిగా కోరడమైనది. ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులకు ఒక మాసానికి గాను రూ.20,000 రూపాయలు చొప్పున వేతనం ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

## డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోండి

**పులివెందుల, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :**



రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తున్న డ్రిప్ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపి పీడీ యం.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం వేముల మండలంలోని వేముల, రంగోరిపల్లె, వి.కొత్తపల్లె గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా అందించిన డ్రిప్ పరికరాలను ఆయన పరిశీలించారు. రైతుల తోటలలో ఇనస్టాల్ చేసిన డ్రిప్ పరికరాలను వారు పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. రైతు భరోసా కేంద్రాల్లోని వీహెచ్‌ఏ, వీఏఏల వద్ద సూక్ష్మనీటి బిందు, తుంపర పరికరాల కోసం దరఖాస్తులు చేసుకున్న రైతులకు యుద్ద ప్రాతిపదికన డ్రిప్ పరికరాలను అందిస్తామని ఏపీఎంఐపీ పీడీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరు తప్పకుండా రైతు భరోసా కేంద్రం వద్ద డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. చీనీ, పత్తి రైతులకు ఆయన సలహాలు, సూచనలు అందించారు.కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి చల్లా సునీల్‌కుమార్, వీహెచ్‌ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీనివాస హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన

**బద్వేలు అర్బన్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**



అగ్నివమాపక వారోత్సవాలలో భాగంగా ఆరవ రోజు బుధవారం పట్టణంలోని నెల్లూరు రోడ్‌లో గల శ్రీనివాస హాస్పిటల్‌లో డా॥ వెంకట సందీప్ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని ఇన్‌ఛార్జ్ అగ్నిమాపక అధికారి కె.వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో చేపట్టారు. అనంతరం అగ్నిమాపక అధికారి వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన పరికరాలను ఎప్పటికీ అందుబాటులో ఉంచుకోవాలని, నాణ్యమైన విద్యుత్ వైర్లను వాడాలని, షార్ట్ సర్క్యూట్‌కు గురికాకుండా చూసుకోవాలన్నారు. ఏదైనా హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే 101 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా బద్వేలు పట్టణంలోని పలు ప్రాంతాలలో అగ్ని ప్రమాదాల నివారణపై తమ సిబ్బంది ద్వారా పలు రకాలుగా డెమో గ్యాస్ సిలిండర్ ద్వారా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

**మైదుకూరు, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**



పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ ఇందులు ఏర్పాటు చేయడం హిందూ, ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందించడమే నని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి మైదుకూరు పట్టణంలోని కడప రోడ్డు లో గల మజీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ ఇందులో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 రోజులపాటు ముస్లిం సోదరులు కఠినమైన ఉపవాస దీక్ష చేపడతారని, ఉపవాస దీక్ష ముగిసే సమయంలో ఇఫ్తార్ ఇందు ఏర్పాటు చేయడం గొప్ప ఐకమత్యాన్ని పెంపొదిస్తుందన్నారు. రాబోయే రంజాన్‌ని ముస్లిం సోదరులందరు ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలతో పాటు మైదుకూరు మునిసిపల్ ఛైర్మన్ మాచునూరు చంద్ర. ప్రజా ప్రతినిధులు, నాయకులు ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ టెస్ట్‌లో శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ

**కడప, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**

కడప నగరంలోని కో ఆపరేటివ్ కాలనీ లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ నందు (ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ ) ఎగ్జామినేషన్స్ లో మన రాష్ట్రంలో సుమారు 4000 మందిలో శ్రీ చైతన్య విద్యాసంస్థలు కడప జోన్ నుండి 257 మంది విద్యార్థులు అత్యధిక ప్రతిభ కనబరిచి ఫస్ట్ మరియు సెకండ్, గ్రాండ్ ప్రైజ్ , కన్సోలేషన్ ప్రైజ్‌లను సాధించారు. కడప జోన్ ఇంఛార్జి రమణ ఆధ్వర్యంలో 1ఫస్ట్ ప్రైజ్ లాప్టాప్ ,సెకండ్ ప్రైజ్ ట్యాబ్ లను కడప నగర మేయర్ వైఎస్సార్సీపీ వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు విద్యార్థిని విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ మరియు సర్టిఫికెట్స్ లను మరియు ప్రైజ్ లను బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్, టీచర్స్, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం

**చిట్వేలి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త**



చిట్వేలి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యం పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం బుధవారం ఎన్‌సిసి అధికారి పసుపుల రాజశేఖర్, చిట్వేలి హెల్త్ కమ్యూనిటి అధికారి నీరజల ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ వేసవిలో అధిక ఎండల వల్ల కలిగే వడదెబ్బ, డయేరియా, ఐరన్, డెఫిసియన్సీ, జంక్‌ఫుడ్ తినడం వల్ల వచ్చే గా స్ట్రిక్, అల్సర్ తదితర జీర్ణకోశ వ్యాధులపై అవగాహన కల్పించామన్నారు 2023లో ఎన్‌సిసిలో చేరబోయే విద్యార్థులను ఉద్దేశించి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. తరువాత ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు పి.చంద్రయ్య, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డేవిడ్‌ప్రసాద్, ఉపాధ్యాయులు దుగ్గరాజు, మధుసూదన్‌రావు, ఎంఎం పద్మావతి, కల్పన కన్యాకుమారి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధిలో కూలీల సంఖ్య పెంచాలి

**దువ్వూరు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**



మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని ఏపీవో రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం సభాభవనంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దువ్వూరులో ప్రతి రోజు 4వేల మంది కూలీలు పని చేయాలని జిల్లా అధికారులు లక్ష్యంగా నిర్ణయించారన్నారు. ప్రస్తుతం 2వేల మంది పని చేస్తున్నారని ఆ సంఖ్యను పెంచాలని క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలన్నారు. వేసవి అలవెన్సు రూ.15 పెంచారని దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలో సామాజిక తనిఖీ బృందం వచ్చే అవకాశం ఉందని రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని తెలిపారు. సమీక్షలో ఈసీ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగ అన్వేషణలో కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు ఉండాలి

**-రీసోర్స్ పర్సన్ కౌటిల్య**

**రాయచోటి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త**




ఇంజనీరింగ్ విద్యార్థులు ఉద్యోగ అన్వేషణలో కమ్యూనికేషన్ స్కిల్స్ అర్థమెటిక్ రీజనింగ్ అంశాలపై గట్టి పట్టు ఉండాలని రిసోర్స్ పర్సన్ కౌటిల్య చెప్పారు. బుధవారం శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో రీ ఇంజనీర్ యువర్ సెల్ఫ్ అంశంపై ఇంజనీరింగ్ మేనేజ్మెంట్ విద్యార్థిని విద్యార్థుల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ గా కౌటిల్య ఆర్గనైజేషన్ తిరుపతి శ్రీధర్ మరియు సీనియర్ మేనేజర్ ఎస్ఎస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ మరియు మేనేజ్మెంట్ విద్యార్థులు అకాడమిక్ అంశాలకే పరిమితం కాకుండా ఉద్యోగాలకు అవసరమైన అనేక రకాల స్కిల్స్ ఉండాలని స్కిల్స్ ఉన్నవారు ఎక్కడైనా రాణిస్తారని ముఖ్యంగా కమ్యూనికేషన్ స్కిల్స్ అర్థమెటిక్ రీజనింగ్ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవచ్చు అన్నారు . సీనియర్ మేనేజర్ ఎం ఎస్ రెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో అపారమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని నవరత్న వంటి సంస్థల యందు ఉద్యోగాలను అందుకోవడానికి గేట్ స్కోర్ ను ప్రామాణికంగా తీసుకుంటారని మరియు ప్రభుత్వ రంగ సంస్థలైన ఆర్ఆర్బీ ,బ్యాంకింగ్ సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు అర్హతలను మరియు సన్నాహక సూచనలను కూలంకుషంగా వివరించారు. శ్రీ సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మొదటి సంవత్సరమునుండే ప్రణాళికను సిద్ధం చేసుకుని తనకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. తమ కళాశాలలోని విద్యార్థులకు వీలైనంతవరకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి తమ కళాశాల కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత చదువులు మరియు ఉద్యోగ అవకాశాలపై పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి బాలాజీ వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా శ్రీనివాస ఆంజనేయమూర్తి

**కడప లీగల్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**

కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా విజయవాడలోని మెట్రోపోలిటన్ సెషన్ జడ్జీ జి.శ్రీనివాస ఆంజనేయమూర్తిని జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నియమిస్తూ మంగళవారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది ఇక్కడ పనిచేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో అదనపు జిల్లా జడ్జీ పీఎస్.మూర్తి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తూ ఉండేవారు. ఇటీవల హైకోర్టు బదిలీ ఉత్తర్వులలో భాగంగా కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా శ్రీనివాస ఆంజనేయమూర్తిని నియమించడం జరిగింది. ఈయన బాధ్యతలు చేపట్టాల్సి ఉంది.

## బీటెక్ రవికి భద్రత కల్పించాలి

**వేంపల్లె, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :**



తెదేపా పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్‌రవి)కి భద్రత కల్పించాలని ఆ పార్టీ మండల కన్వీనరు రామమునిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం వేంపల్లెలోని టీడీపీ కార్యాలయం నుండి నాలుగురోడ్ల కూడలి వరకు టీడీపీ నాయకులు నల్లరిబ్బన్లతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అక్కడ ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామమునిరెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవికి గన్‌మెన్‌లను తొలగించడం అన్యాయం అన్నారు. వైకాపాలో ఎలాంటి పదవులు లేకుండానే కొందరికి గన్‌మెన్లను కల్పించడం సిగ్గుచేటన్నారు.రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల ప్రాణాలకు రక్షణ కరవైందని, మహిళల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. వెంటనే బీటెక్ రవికి గన్‌మెన్‌లతో భద్రత కల్పించాలని వైకాపా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు మేదర రవికుమార్, మైనార్టి కన్వీనరు తెలంగాణవలి, పట్టణాధ్యక్షుడు ఆర్‌వి రమేష్, బాల క్రిష్ణారెడ్డి, మల్లికార్జున, మహమ్మద్, డక్కారమేష్, రెడ్డెయ్య, రామక్రిష్ణారెడ్డి, మడక శ్రీనివాసులు, చెంద్రాయుడు, పూల అల్లాబకాష్, ఎద్దుల శేషారెడ్డి, బాబావలి, జబీవుల్లా, రామాంజనేయులు, వేమకుమార్, మారుతి, పక్కీరారెడ్డి, గంగిరెడ్డి, శశిధర్‌రెడ్డి, వెంకటయ్య, ఈశ్వరయ్య, జిలాన్‌బాషా పాల్గొన్నారు.

# విధేయుడికి పట్టం

### అట్టహాసంగా మార్కెట్‌కమిటి ఛైర్మన్ ప్రమాణస్వీకారం

**రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త**



రైల్వేకోడూరు నియోజకవర్గంలోని కెఆర్‌కండ్రిక గ్రామానికి చెందిన ముద్దలూరు సుబ్బరామరాజు వైసిపి పార్టీ స్థాపించినప్పటి నుండి పార్టీకి వీరవిధేయుడిగా పనిచేసి ఉన్నత భావాలతో అంచలంచెలుగా ఎదిగి మార్కెట్‌కమిటి ఛైర్మన్ అయ్యారని రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. బుధవారం రైల్వేకోడూరు మండలంలోని సమతానగర్‌వద్ద వ్యవసాయ మార్కెట్‌కమిటి నందు మార్కెట్‌కమిటి ఛైర్మన్‌గా ముద్దలూరు సుబ్బరామరాజు ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ సుబ్బరామరాజు మృదుస్వభావి అని, పార్టీ పట్ల వీరవిధేయుడిగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో విజవంతంగా పనిచేసి గుర్తింపు పొందారని ఆయన అన్నారు. వ్యవసాయ, రైతుల కోసం క్షత్రియున్నే నియమించడం ఎంతో సంతోషంగా ఉందని, రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టే ప్రభుత్వ పథకాలను, వ్యవసాయ రైతులను అందుబాటులో ఉండేవిధంగా కృషి చేసి వ్యవసాయ కమిటికి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని అన్నారు. రైల్వేకోడూరు ప్రాంతంలో పాడి పంటలకు ప్రసిద్ధి చెందిందని అదేవిధంగా ఆర్బికెల ద్వారా పంటల విధానాన్ని రైతులకు లాభాలబాటను చేపట్టే విధంగా కృషి చేసి రైల్వేకోడూరు మార్కెట్‌కమిటికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ మార్కెట్‌కమిటీ ఛైర్మన్‌గా పనిచేసే అదృష్టాన్ని సుబ్బరామరాజుకు రావడం ఎంతో అదృష్టజాతకులని, బాల్యదశలోనే ఎమ్మెల్యే అంతటిస్థాయి పదవి రావడం గొప్ప విషయమని అందరి ఆశీస్సులతో సుబ్బరామరాజు మార్కెట్‌కమిటిని అభివృద్ధిపరచాలన్నారు. అన్నమయ్య జిల్లా వైసిపి అధ్యక్షులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ సుబ్బరామరాజు బాల్యదశలోనే ఉన్నత పదవిని చేపట్టి వందలాది మంది అభిమానుల మధ్య ప్రమాణ స్వీకారం చేయడం సంతోషంగా ఉందని, ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా వ్యవసాయ మార్కెట్‌కమిటిని అభివృద్ధిపరచాలని శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి రైతు ప్రభుత్వానికి వ్యవసాయం నుండి పుట్టిన సుబ్బరామరాజు ఛైర్మన్ కావడం సంతోషమని అన్నారు. ఉన్నతస్థాయిలో మార్కెట్‌కమిటీని అభివృద్ధి చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఉప మండలాధ్యక్షుడు ధ్వజారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్‌కమిటి ఛైర్మన్ క్షత్రియులకే ఇవ్వాలని మొదటి నుండి ఎంపి, ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, సరైన వ్యక్తికి ఈ పదవి ఇవ్వడం చాలా ఆనందకర విషయమని, రాజకీయాల్లో విధేయుడిగా పనిచేసిన సుబ్బరామరాజు అభినందనీయులని అన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట వైసిపి సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, సిడి నాగేంద్ర, పంజం సందీప్‌రెడ్డి, ఉపసర్పంచ్ తోట శివసాయి, బుడుగుంటపల్లె సర్పంచ్ చంద్రశేఖర్, యజ్ఞం చంద్రశేఖర్, గునిశెట్టి ప్రశాంతిరమేష్, జడ్‌పిటిసి పాలెంకోట రత్నమ్మ, సహదేవరెడ్డి, క్షత్రియ సంఘం నాయకులు శివరామరాజు, పర్వతం విజయ్‌కుమార్‌రెడ్డి, సుదర్శన్‌రాజు, రమేష్‌వర్మ, సర్పంచ్‌లు నాయిని హరిక్రిష్ణారెడ్డి, చియ్యవరం విష్ణు, దొమ్మరాజు సుబ్రమణ్యంరాజు, గోపి, బత్తల సుబ్రమణ్యం, పలువురు వైసిపికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన సుబ్బరామరాజును గజమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## మండలంలో సబ్‌కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**నందలూరు, ఏప్రిల్ 19 ప్రభాతవార్త**



నందలూరు మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనాలు లేక కొన్ని సంవత్సరాల నుండి జిల్లా పరిషత్ పాఠశాలలోనే కళాశాలను నడుపుకుంటూ రావడం జరుగుతూ ఉంది. దీనిపై ఎన్ని అర్జీలు ఇచ్చినా ఫలితం లేకపోయింది. నేడు దాని నిర్మాణం కోసం వచ్చిన అర్జీల నిమిత్తమై రాజంపేట సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సర్వేనంబరు 1160/1-4 స్థలాన్ని తహశీల్దారు ఉదయ్‌శంకర్‌రాజుతో కలిసి పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఇది ప్రభుత్వ భూమి కావడం వల్ల ఇక్కడ ప్రభుత్వ ఆసుపత్రి లేదా జూనియర్ కళాశాల నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించడం జరిగిందని ఆయన అన్నారు. దీనిపై పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇక్కడ త్వరలోనే నిర్మాణ పనులను చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశిల్దారు ఉదయ్‌శంకర్‌రాజు, సర్వేయర్‌లు, విఆర్‌ఒలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన పలువురు నాయకులు

**బద్వేలు అర్బన్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**






బద్వేలు నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును బుధవారం ప్రముఖ క్లాస్-1 కాంట్రాక్టర్, సీనియర్ టీడీపీ నాయకులు మంచూరు సూర్య నారాయణ రెడ్డి, గంగసాని వేణుగోపాల్ రెడ్డి, కడప జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరి కనమ ర్లపూటి ప్రసాద్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాబోవు 2024 ఎన్ని కల్లో టీడీపీ గెలుపుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం దివంగత మాజీ మంత్రి బిజివే ముల వీరారెడ్డి ఎనలేని కృషి చేశారని, తరువాత మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువ నేత రితీష్ రెడ్డిలు కార్యకర్తలకు అండగా ఉంటూ గెలుపు కోసం కృషి చే స్తున్నారని, వారికి పార్టీ నాయకులు, కార్యకర్తలు వెన్నంటి ఉంటూ తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవంగా తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మిత్తికాయల రమణ, నాగరాజుపల్లె మస్తాన్ బాబు, కొప్పర్తి రాధయ్య, దాసా జయరామయ్య, మదళ్ళపల్ల వాసు, కృష్ణమూర్తి, దరిశి వెంకటసుబ్బయ్య,పలువురు పాల్గొన్నారు.

## కంటి అద్దాలు పంపిణీ

**రాయచోటి, ఏప్రిల్ 19ప్రభాతవార్త:**



రాయచోటి రూరల్ పరిధిలోని శిబ్యాల చెన్నముక్కపల్లి గ్రామ పంచాయతీలోనే ఎపి మోడల్‌స్కూల్ కెజిబివి పాఠశాల చెన్నముక్కపల్లె జిల్లా ఉన్నత పాఠశాలలోనే విద్యార్థిని విద్యార్థులకు బుధవారం కంటి చూపుతో బాధపడుతున్న విద్యార్థులందరికీ కంటి అద్దాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అంధత్వ నివారణ పథకం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు ఫేస్-3 కింద పంపిణీ చేశారు. అన్నమయ్య జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ రియాజ్ బేగ్ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల్లోని కంటి చూపుతో బాధపడుతున్న 81 మందికి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ విష్ణు, డాక్టర్ రజిత, ఎండపల్లి ఆరోగ్యశ్రీ సిబ్బంది, ఆయా పాఠశాల సిబ్బంది, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

## పోరుమామిళ్ళలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసిన చంద్రబాబు

**పోరుమామిళ్ళ రూరల్, ఏప్రిల్ 19ప్రభాతవార్త:**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు బద్వేల్ పర్యటన ముగించుకుని గిద్దలూరుకు వెళ్తూ మార్గమధ్యంలో పోరుమామిళ్ళ పట్టణంలో ని గాంధీ బొమ్మ సర్కిల్‌లో ఆగి పోరుమామిళ్ళ మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ నాయుడుతో కలిసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ సుధాకర్ దంపతులు చంద్రబాబును శాలువాతో సత్కరించారు. బద్వేల్ నియోజకవర్గంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి టిడిపి కార్యకర్తలు, నాయకులు, భారీగా పోరుమామిళ్ళకు చేరుకొని చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేశారు. ఈ పర్యటన తెలుగుదేశం నాయకుల్లో, కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని చెప్పవచ్చు.

## రైలుకింద పడి ఎల్‌ఐసి ఏజెంట్ మృతి

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త**



(ఫైల్‌ఫోటో)

రాజంపేట రైల్వేస్టేషన్‌లో బుధవారం ఎల్‌ఐసి ఏజెంట్ కెవి రమణయ్య మృతి చెందారు. మృతుడు పుల్లంపేట మండలం వత్తలూరు బుగ్గ అగ్రహారంవాసి అని తెలుస్తోంది. గతంలో రాజంపేటలో నివాసం ఉండేవారు. గత కొంతకాలంగా తిరుపతిలో నివాసం ఉంటున్నట్లు తెలిసింది. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## గృహమిత్ర పథకం ద్వారా బహుమతులు

**వేంపల్లె, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :**



దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి పండుగల సందర్భంగా హిందుస్థాన్ పెట్రోలియం సంస్థ సురక్ష అవగాహన సదస్సు క్రింద గృహమిత్ర పథకం నిర్వహించారు. ఈ పథకం ద్వారా కడప జిల్లాలోని మొత్తం హెచ్‌పి గ్యాస్ కస్టమర్లకు లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి వారికి బహుమతులు ప్రదానం చేశారు. వేంపల్లెలో శ్రీసాయిరజిత గ్యాస్ ఏజెన్సీలో ఉన్న వినియోగదారురాలైన కె.సులోచనకు మొదటి బహుమతి కింద ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనం, ఎస్‌కె జైలూన్‌కు రెండో బహుమతి కింద మొబైల్‌ఫోన్ గెలుపొందారు. ఈ బహుమతుల ప్రదాన కార్యక్రమంలో హెచ్‌పిసీఎల్ సేల్స్ మేనేజరు సెంథిల్ కిషోర్, నూతన సేల్స్ మేనేజరు అశోక్‌ల సమక్షంలో శ్రీసాయి రజిత గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్ రవికుమార్‌రెడ్డి బహుమతులు అందించారు.

## పీలేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఎల్లయ్య

**పీలేరు, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:**



పీలేరు మార్కెట్ కమిటీకి నూతనంగా కేవి.పల్లె మండలం గర్నిమిట్టకు చెందిన బీసీ కులానికి చెందిన యల్లయ్యను నియమించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. యల్లయ్య రైతు కుటుంబంలో పుట్టి మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలుగా తీసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. వైస్‌ఛైర్మన్‌గా రమేష్‌రెడ్డి, డైరెక్టర్‌లుగా 17 మందిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. త్వరలోనే ప్రమాణస్వీకారం చేయనున్నట్లు మార్కెట్ కమిటీ ఛైర్మన్ యల్లయ్య తెలిపారు. బీసీలకు సముచిత స్థానం ఇవ్వడం వైసీపీకి సాధ్యం: జడ్పీటీసీ గజ్జల శ్రుతి శీనురెడ్డి రాష్ట్రంలో అభివద్ధి దిశలో పయనిస్తున్న పీలేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా బీసీ కులానికి చెందిన యల్లయ్యను నియమించడంతో వైసీపీ కాంగ్రెస్ పార్టీ బీసీలకు సముచిత స్థానం కల్పించడంలో ముందుంటుందని జడ్పీటీసీ సభ్యురాలు గజ్జల శ్రుతి శీనురెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## అబ్దుల్ రశీద్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్‌కుమార్‌రెడ్డి

**రాయచోటి, ఏప్రిల్ 19ప్రభాతవార్త:**



రాయచోటి పట్టణం మసీదు ఎదురుగా ఉన్నటువంటి అబ్దుల్ రశీద్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసి రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అబ్దుల్ రశీద్‌ను కలిసి అనారోగ్యానికి కారణాలు, ప్రస్తుతం తీసుకుంటున్న మందులు, కుటుంబ ఆర్థిక పరిస్థితులు తదితర అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. రమేష్‌కుమార్‌రెడ్డి వెంట రాష్ట్ర టిడిపి కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేసిన ఎమ్మెల్యే

**దళితులను లోకేష్ అవమానించారంటూ నిరసన**

**నాలుగు రోడ్ల కూడలిలో హై టెన్షన్**

**పోలీసుల జోక్యంతో సర్దుమణిగిన వ్యవహారం**

**బద్వేలు, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బద్వేలు పర్యటన సందర్భంగా కార్యకర్తల సమావేశం ముగించుకొని గిద్దలూరుకు వెళ్ళేందుకు సిద్ధమవుతున్న తరుణంలో బద్వేలు వైసీపీ ఎమ్మెల్యే డా॥ సుధ కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. యువగళంలో నారా లోకేష్ దళితులను అవుమానించే విధంగా మాట్లాడారని చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడమేగాక దళితులకు క్షమాపణ చెప్పిన తరువాతే బద్వేలుకు రావాలని నాలుగు రోడ్ల కూడలిలో ఎమ్మెల్యే డా॥ సుధ ఆధ్వర్యంలో దళితులతో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా॥ సుధ మాట్లాడుతూ చంద్రబాబు కుటుంబానికి దళితులంటే పడదని, గతంలో కూడా దళితులను అవుమానించే విధంగా నారా చంద్రబాబు నాయుడు మాట్లాడడం జరిగిందన్నారు. అదే విధంగా యువగళంలో కూడా అవుమానించే రీతిలో లోకేష్ మాట్లాడడం సమంజసం కాదన్నారు. దళితుల ఓట్లతో గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దళితులకు న్యాయం చేస్తామని చెప్పి దళితులను విమర్శించే స్థాయికి వెళ్ళారన్నారు. ఎన్నో పర్యాయాలు దళితులను అవుమానించే రీతిలో చంద్రబాబు, లోకేష్ మాట్లాడారని, ప్రజలే వారికి బుద్ధి చెబుతారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దళితులకు జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక స్థానం, గుర్తింపు కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. దళితుల పక్షపాతిగా జగన్‌మోహన్ రెడ్డి వ్యవహరిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు దళితులను అవుమానించడమేగాక వారి పట్ల వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా దళితులంతా ఐక్యతతో ముందుకెళ్ళి చంద్రబాబు పర్యటనను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. నాలుగు రోడ్ల కూడలిలో కాన్వాయ్‌ని అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించారు. డిఎస్పీ వంశీధర్ గౌడ్, సీఐలు వెంకటేశ్వర్లు, హనుమంతు నాయక్, ఎస్‌ఐ వెంకట రమణతో పాటు ప్రత్యేక పోలీసు బలగాల అధికారులు, ప్రత్యేక పోలీసులు ఎలాంటి గొడవ జరగకుండా సర్దుమనిగే ప్రయత్నం చేశారు. మొదటగా ఎమ్మెల్యేకు నచ్చచెప్పే ప్రయత్నం చేసి నిరసన విరమింప చేయాలని విన్నవించారు. వారు ససేమిరా అనడంతో అప్పుడే చంద్రబాబు కాన్వాయ్ మొదలుకావడంతో కూడలిలో కొద్ది సేపు హై టెన్షన్ మొదలైంది. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకొని చంద్రబాబు కాన్వాయ్‌ని బద్వేలు సరిహద్దు దాటించారు. చంద్రబాబు వెళ్ళిపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.